ఎప్పుడూ ఒకరికి ఇవ్వడం నేర్చుకో తీసుకోవడం కాదు
- రామకృష్ణ పరమహంస

Truth of News
PRGI Reg No: APTEL/26/A4781
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 62 | శనివారం 10 అక్టోబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



# యుద్ధభూమి ఢిల్లీ!

- నేడు సీజేపీ నిరసన నేపథ్యంలో జంతర్ మంతర్ పరిసర ప్రాంతాల్లో ఇంటర్నెట్ నిలిపివేత
- భారీ బందోబస్తు.. 57 మెట్రో స్టేషన్ల మూసివేత
- అనుమతి లేకున్నా సీజేపీ నిరసన చట్ట విరుద్ధం
- రవాణాపై పూర్తి నిషేధం వద్దు: సుప్రీం

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద చేపట్టనున్న నిరసనను అడ్డుకునేందుకు కేంద్రం భారీ చర్యలకు ఉపక్రమించింది. జంతర్ మంతర్ పరిసర ప్రాంతాలను, ఢిల్లీకి దారితీసే సరిహద్దులను, రవాణా సదుపాయాలను తమ ఆధీనంలోకి తీసుకొని, భారీ ఎత్తున కేంద్ర, రాష్ట్ర పోలీసులను భద్రత కోసం వినియోగిస్తుంది. నిరసనకారులు సున్నిత ప్రాంతాల వైపు వెళ్లకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. 57 మెట్రోస్టేషన్లపై ఆంక్షలు, పలు స్టేషన్ల మూసివేత, నిరసనలకు దారితీసే రోడ్ల మూసివేత, శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి శనివారం రాత్రి 10 గంటల వరకు ఇంటర్నెట్ సేవలు నిలిపివేత వంటి చర్యలను చేపట్టారు. ఢిల్లీ జంతర్ మంతర్‌కి దారి తీసే అన్ని సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను మరింత కట్టుదిట్టం చేశారు. పాఠశాలలు, కళాశాలలను మూసివేయాలని, ఆన్‌లైన్ మాధ్యమంగా నిర్వహించుకోవాలని అధికారులు యాజమాన్యాలను ఆదేశించారు. పలువురు

- మిగతా 2లో..

## జ్ఞానేశ్‌ను తొలగించడంలో
# జోక్యం చేసుకోండి

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఇండి కూటమి వినతి
- సీఈసీ, ఈసీల జీవితకాల రక్షణ చట్టం వద్దు
- సర్ వల్ల గల్లంతైన ఓట్లను పునరుద్ధరించండి
- గత రెండేళ్లలో జరిగిన అన్ని అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయండి
- కూటమి బృందం రెక్వెస్ట్
- రుజువులు అడిగారు.. సమర్పిస్తామని చెప్పాం: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

సర్ ప్రక్రియలో అక్రమాలు, సీఈసీ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదిముర్మును ఇండి కూటమి కోరింది. సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌ను వెంటనే తొలగించాలని, సీఈసీ, ఈసీలకు జీవితకాల రక్షణ చట్టాన్ని తొలగించాలని, గత రెండేళ్లలో జరిగిన అన్ని అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయాలని కూటమి నేతలు డిమాండ్ చేశారు. ఓటరు జాబితాలో గల్లంతైన 13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లను పునరుద్ధరించాలని, తిరిగి బ్యాలెట్ విధానాన్ని ప్రవేశపెట్టాలని స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్రపతికి ఇండి కూటమికి చెందిన 10 మంది సభ్యుల ప్రతినిధి బృందం వినతి పత్రం సమర్పించింది. ఎన్నికల మోసంపై ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను రాష్ట్రపతి ఖండించలేదని, ప్రశ్నించలేదని, ఈ విషయం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు.

సాక్ష్యాధారాలు సమర్పించాలని ముర్ము ప్రతినిధి బృందాన్ని కోరారని, ఓట్ల దొంగతనం ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు దేశవ్యాప్తంగా తెలిసి ఉన్నాయని, వాటిని సమర్పించడానికి ప్రతిపక్షం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. ఇండి కూటమి రాష్ట్రపతితో భేటీ అయిన అనంతరం రాహుల్‌గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకు ముందు ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ హౌస్ నుంచి రాష్ట్రపతి భవన్ వైపు ర్యాలీగా వెళ్లారు. అయితే విజయ్ చౌక్ వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. పలువురు నాయకులు ఆ ప్రదేశంలో ధర్నా చేశారు. అంతకు ముందు ఇండి కూటమి ఎంపీలు సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో సమావేశమై తమ వ్యూహాలను రచించారు. ఓట్ల చోరీ అంశాన్ని ఇండి కూటమికి చెందిన ప్రతిపక్ష పార్టీలు రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లాయి. కాంగ్రెస్ సీనియర్ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా, సీపీఐఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా, ఎన్‌సీపీసీపీ నాయకురాలు

- మిగతా 2లో..



## నోయిడా విమానాశ్రయానికి
# ప్రధాని మోదీ పేరు..

- యోగి సర్కారు కీలక నిర్ణయం!
- పేరుమార్పు తీర్మానానికి యోగి మంత్రివర్గం ఆమోదం
- మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితం పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్ణయం
- మోదీకి రాష్ట్రంతో ప్రత్యేక అనుబంధం ఉందన్న యోగి
- విమానాశ్రయం తొలి దశను మార్చిలో ప్రారంభించిన ప్రధాని మోదీ
- తొలి దశలో ఏడాదికి 1.2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# బై పోల్‌లో బీజేపీ, టీవీకే హవా

- బీజేపీ ఖాతాలో పశ్చిమ బంగాల్ రెండు అసెంబ్లీ, అసోం ఒక లోక్‌సభ స్థానం
- తమిళనాడు రెండు అసెంబ్లీ స్థానాల్లో టీవీకే పాగా
- పుదుచ్చేరి అసెంబ్లీలో ఎన్డీయే కూటమి అభ్యర్థి విజయం




కోల్‌కతా/చెన్నై/గోవా/పుదుచ్చేరి – సూర్య వాస్తవం

దేశవ్యాప్తంగా ఐదు అసెంబ్లీ, ఒక లోక్ సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ, టీవీకే గాలి వీచింది. రెండు అసెంబ్లీ, ఒక లోక్‌సభ స్థానాల్లో బీజేపీ విజయఢంకా మ్రోగించగా, బీజేపీ అనుబంధ పార్టీ ఒక స్థానంలో, రెండు స్థానాల్లో టీవీకే పార్టీ విజయం సాధించాయి. అక్టోబర్ 6న పశ్చిమ బంగాల్‌లోని రెండు అసెంబ్లీ స్థానాలు, తమిళనాడులో రెండు అసెంబ్లీ స్థానాలు, పుదుచ్చేరిలోని ఒక అసెంబ్లీ స్థానం, అసోంలోని ఒక లోక్ సభ స్థానానికి ఉప ఎన్నికలు జరగ్గా, శుక్రవారం ఫలితాలు విడుదలయ్యాయి. పశ్చిమ బంగాల్‌లోని నందిగ్రామ్‌లో సీఎం సువేందు రికార్డును బద్దలు కొడుతూ బీజేపీ అభ్యర్థి హసిరానీ రథ్ 1.22 లక్షల మెజార్టీతో విజయం సాధించారు. ఈ మెకు 1,64,427 ఓట్లు దక్కాయి. ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు 41,674 ఓట్లతో

- మిగతా 2లో..



## కరవుపై 12న మంత్రులతో
# రేవంత్‌రెడ్డి సమీక్ష

- ఎల్ నినో ప్రభావంతో 17శాతం తగ్గిన వర్షపాతం
- రాష్ట్రంలోని 320 మండలాల్లో తీవ్ర కరవు ప్రభావం
- కేంద్రం నుంచి రూ.20,000 కోట్ల ప్యాకేజీ కోరిన రాష్ట్ర ప్రభుత్వం

2లో

## రైతులు పంట గురించి ఆలోచించాలే తప్ప
# ఆందోళన చెందకూడదు

- నర్సింగోలులో చంద్రబాబు ప్రసంగం డీటెయిల్స్
- ప్రకాశం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు
- 'మీ భూమి-మీ హక్కు' కింద రాజముద్రతో కొత్త పాస్‌బుక్‌ల పంపిణీ
- రూ.166 కోట్లతో పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్‌కు శంకుస్థాపన
- అధికారుల పనితీరుపై బహిరంగంగా సమీక్ష.. పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశం
- బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించిన ముఖ్యమంత్రి




జరుగుమల్లి– సూర్య వాస్తవం

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా పాలన సాగిస్తామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం నర్సింగోలులో శుక్రవారం ఆయన పర్యటించి, 'మీ భూమి – మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రైతు పొలంలో పంట గురించి ఆలోచించాలి గానీ, తన భూమి భద్రతపై ఆందోళన చెందకూడదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

### భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల విషయంలో జరిగిన అవకతవకలను సరిదిద్ది, రైతులకు పూర్తి భద్రత కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "మీ భూమి మీదే, హక్కు మీదే, ఆ హక్కును కాపాడే బాధ్యత మాది. అందుకే పాత పాస్‌బుక్‌లపై నాయకుల బొమ్మలు తొలగించి, ప్రభుత్వ రాజముద్రతో గ్యారెంటీ ఇస్తున్నాం" అని అన్నారు.

- మిగతా 2లో..

# యుద్ధభూమి ఢిల్లీ!

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులు, నిరసనల్లో పాలు పంచుకోవడానికి వివిధ మార్గాల్లో వస్తున్న వారిని శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి నిరసనకారులు నగరంలోకి ప్రవేశించకుండా పలు మార్గాలను పూర్తిగా, పాక్షికం గా మూసివేశారు. 221 కంపెనీల కేంద్ర బలగాలు (23వేలమంది) 8 నుంచి 12వ తేదీ వరకు ఢిల్లీలో మోహరించారు. 15వేల మంది ఢిల్లీ పోలీసులు అదనపు భద్రతను నిర్వర్తిస్తున్నారు. నిరసనకారుల ప్రదర్శన వద్ద ఫ్రంట్ లైన్‌లో 150 మంది పోలీసులను బాడీ కెమెరాలతో మోహరించ నున్నారు. గతంలో జరిగిన నిరసనల్లో అలజడి సృష్టించిన 2800 మందిపై నిఘా పెట్టా రు. కొందరిని బైండోవర్ చేశారు. 57 మెట్రో స్టేషన్లలను మూసివేయనున్నారు. 10వ తేదీ ఉదయం 4 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జంతర్ మంతర్‌కు దగ్గరలో ఉన్న రెండు రైల్వే స్టేషన్ల నుంచి పూర్తిగా రైళ్ల రాకపోకలను నిలిపివేశారు.

**సీజేపీ నిరసన చట్ట విరుద్ధం: సుప్రీం**

ఢిల్లీలో మెట్రో స్టేషన్లు, రైళ్ల సేవలపై ఆంక్షలు విధించడంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. అదే సమయంలో అనుమతి లేకున్నా నిరసన చేయడం చట్ట విరుద్ధమవుతుందని తెలిపింది. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలకు చోటు ఉన్నా, అధికారులు అనుమతి నిరాకరించినా నిరసన చేయడం చట్టవిరుద్ధమని పేర్కొంది. భద్రతా చర్యలు అవసరమే అయినా ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయడం సరికాదని స్పష్టం చేసింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిరసనలను అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై సీపీఐ (ఎం) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం విచారించింది. ఇటు కేంద్ర ప్రభుత్వం, అధికారులు, అటు సీజేపీపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఢిల్లీ మెట్రో స్టేషన్లు, రైల్వే స్టేషన్ల మూసివేతపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఆంక్షల వల్ల వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని వెల్లడించింది. ఢిల్లీకి అన్ని ప్రాంతాల ప్రజలు రోజుకు లక్షలాది మంది రాకపోకలు సాగిస్తుంటారని, ఉద్యోగులు, ఇతర అవసరాల కోసం ప్రయాణించే వారికి ఇబ్బందులు కలగకుండా చూ డాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు.

# బై పోల్‌లో బీజేపీ, టీవీకే హవా

(మొదటిపేజీ తరువాయి)

ఓటమి పాలయ్యారు. ఇదే రాష్ట్రంలోని మరో స్థానం రెజీనగర్‌లోనూ బీజేపీ అభ్యర్థి శంక్‌రావ్ సర్కార్ 1,29,914 ఓట్లు దక్కగా, ప్రత్యర్థి ఏజీయూపీ (ఆమ్ జనతా ఉన్నయన్ పార్టీ) అభ్యర్థి గూలాం నబీకి 54,098 ఓట్లతో ఓటమి పాలయ్యారు.

75,816 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు. ముస్లింలు 70 శాతంగా ఉన్న ఈ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి భారీ ఓట్ల తేడాతో విజయం సాధించడం పట్ల వి శ్లేషకుల అంచనాలు పూర్తిగా తలకిందులైనట్లయ్యింది. అసోంలోని నౌగావ్ లోక్‌సభ ఉ ప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి దేవాశిష్ శర్మకు 6,87,110 ఓట్లతో విజయం సాధించగా, ఏఐయూడీఎఫ్ (ఆల్ ఇండియా యూనైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్) అభ్యర్థి బద్రుద్దీన్ అజ్మల్‌కు 5,20,976 ఓట్లతో ఓటమిపాలయ్యారు.

తమిళనాడు ధారాపురం అసెంబ్లీ స్థానం నుంచి టీవీకే అభ్యర్థి సత్యబామ 66,841 ఓట్లతో విజయం సాధిచగా, ఏఐడీఎంకే అ భ్యర్థి సుగున్య 57,370 ఓట్లు దక్కించుకొని ఓటమి పాలయ్యారు. ఏఐడీఎంకేలో ఉండగా ఇదే స్థానం నుంచి గెలుపొందిన సత్యభామ టీవీకేలో చేరడంతో ఎన్నికలు అనివార్యంగా మారాయి. మధురాంతకం అసెంబ్లీ స్థానం నుంచి టీవీకే అభ్యర్థి కె. కుమార్‌వేల్ 74,048 ఓట్లతో విజయం సాధించగా, డీఎంకే అభ్యర్థి 54,008 ఓట్లతో ఓటమి పాలయ్యారు. పుదుచ్చేరి నుంచి ఎన్డీయే మద్దతు ఏఐఎన్‌ఆర్‌సీ (ఆల్ ఇండియా ఎన్‌ఆర్ కాంగ్రెస్) అభ్యర్థి అశోక్ ఆనంద్ 13,358 ఓట్లతో విజయం సాధించగా, కాంగ్రెస్ అభ్యర్థి ఇ. వినియాగమ్ 4,876 ఓట్లు దక్కించుకొని ఓటమి పాలయ్యారు.

# తమిళనాడులో సీఎం విజయ్‌కు బూస్ట్..

- రెండు ఉప ఎన్నికల్లోనూ టీవీకే ఘన విజయం!
- మదురాంతకంలో మరగతం కుమరవేల్ 17,554 ఓట్ల మెజారిటీతో విజయం
- ధరాపురంలో 10,196 ఓట్ల మెజారిటీతో గెలిచిన సత్యభామ
- అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి టీవీకేలో చేరడంతో అనివార్యమైన ఉపఎన్నికలు
- 4 నెలలుగా చేసిన పనులకు ప్రజలు ఇచ్చిన మద్దతుగా టీవీకే నేతల అభివర్ణన
- ఈ విజయాలతో విజయ్ ప్రభుత్వానికి రాజకీయంగా ఊరట



చెన్నై- సూర్య వాస్తవం

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి ఉప ఎన్నికల్లో భారీ విజయం దక్కింది. మధురాంతకం, ధరాపురం అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. రెండు స్థానాల్లోనూ ప్రధాన ప్రత్యర్థి డీఎంకే రెండో స్థానానికే పరిమితమైంది. ఈ ఫలితాలు విజయ్ ప్రభుత్వానికి రాజకీయంగా మరింత బలాన్ని ఇచ్చాయి. మధురాంతకం నియోజకవర్గంలో టీవీకే అభ్యర్థి మరగతం కుమరవేల్ 17,554 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఆమెకు 61,470 ఓట్లు రాగా, డీఎంకే అభ్యర్థి పరంధామన్‌కు 43,916 ఓట్లు వచ్చాయి. అన్నాడీఎంకే అభ్యర్థి గణిత సంపత్ 38,770 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 27 మంది పోటీ చేయగా, 86.26 శాతం పోలింగ్ నమోదైంది.

ధరాపురంలోనూ టీవీకే అభ్యర్థి సత్యభామ విజయకేతనం ఎగురవేశారు. ఆమెకు 62,596 ఓట్లు రాగా, డీఎంకే అభ్యర్థి సుకన్యకు 52,400 ఓట్లు వచ్చాయి. దీంతో సత్యభామ 10,196 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అన్నాడీఎంకే అభ్యర్థి భానుమతి 41,078 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఇక్కడ 22 మంది అభ్యర్థులు పోటీ చేయగా, 80.30 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ రెండు స్థానాలకు ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. గతంలో అన్నాడీఎంకే తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. దీంతో ఖాళీ అయిన స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. టీవీకే, డీఎంకే, అన్నాడీఎంకేతో పాటు వామపక్షాలు, నామ్ తమిళర్ కట్చి కూడా పోటీలో నిలిచాయి. ఈ విజయాలు తమ ప్రభుత్వం గత నాలుగు నెలలుగా చేసిన పనులకు ప్రజలు ఇచ్చిన మద్దతుగా టీవీకే నేతలు అభివర్ణించారు. ఎన్నికల ప్రచారంలో హోరాహోరీ పోటీ నెలకొన్న నేపథ్యంలో రెండు స్థానాలనూ గెలుచుకోవడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. మరోవైపు, రెండు చోట్లా ఓటమి పాలైన డీఎంకే, అన్నాడీఎంకే తమ ఫలితాలను సమీక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఉప ఎన్నికలు రెండు స్థానాలకే పరిమితమైనా, విజయ్ ప్రభుత్వానికి రాజకీయంగా మరింత ప్రోత్సాహాన్నిచ్చాయి.

# జ్ఞానేశ్‌ను తొలగించడంలో జోక్యం చేసుకోండి

(మొదటిపేజీ తరువాయి)

సుప్రియా సూలే, ఆర్జేడీకి చెందిన మనోజ్ ఝా, వీసీకే అధినేత తోల్ తిరుమావళవన్, సమాజ్వాదీ పార్టీ నాయకుడు రాజీవ్ రాయ్ తదితరులు ప్రతిపక్ష బృందంలో భాగంగా రాష్ట్రపతిని కలిశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞనేష్ కుమార్ రాజీనామాను కోరడం, సంబంధిత అధికారులను సస్పెండ్ చేయడం, గత రెండేళ్లలో జరిగిన అన్ని అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయడం వంటి చర్యల కోసం తమ అధికారాలను వినియోగించాలని వారు ఆమెను కోరారు. ఎన్నికల కమిషనర్లకు జీవితకాల రక్షణ కల్పించే 2023 నాటి చట్టాన్ని రద్దు చేయాలని, అలాగే అన్ని ఎన్నికలకు తిరిగి పేపర్ బ్యాలెట్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కూడా ఇండి కూటమి పార్టీలు డిమాండ్ చేశాయి. ఓటర్ల జాబితా నుంచి అక్రమంగా తొలగించిన 13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లను పునరుద్ధరించాలని కోరారు. రాష్ట్రపతి ముర్ముతో సమావేశం అనంతరం, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ భారత ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నారని రాష్ట్రపతికి తాము స్పష్టంగా చెప్పామన్నారు. ఆమె మేము చెప్పినదాన్ని అంగీకరించి, ఆ తర్వాత ఎన్నికల మోసానికి సంబంధించిన రుజువులను తనకు అందించాలని మాతో అన్నారు' అని చెప్పారు. 'వాటిని సమర్పించడానికి మేము సంతోషిస్తాం' అని ఆయన అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ఈవీఎంలను పక్కనపెట్టి, బ్యాలెట్ పత్రాల ద్వారా ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను ఖర్గే పునరుద్ఘాటించారు.

**రాష్ట్రపతి భవన్ వైపు భారీ ర్యాలీ**

శుక్రవారం రాత్రి సుమారు 8 గంటలకు ఇండియా బ్లాక్ ఎంపీలు 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అనే పెద్ద బ్యానర్‌ను పట్టుకుని పార్లమెం ట్ హౌస్ నుంచి రాష్ట్రపతి భవన్ వైపు ర్యాలీ చేశారు. విజయ్ చౌక్ వద్ద పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్త తంగా మారింది. దీంతో పలువురు ప్రతిపక్ష నాయకులు ధర్నాకు దిగారు. ఈ నిరసనలో పాల్గొన్న వారిలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మోయిత్రా, కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గోగోయ్ తదితరులు ఉన్నారు. అంతకుముందు, ఓటు దొంగతనం ఆరోపణలపై ఆందోళనను తీవ్రతరం చేయడానికి, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేయడానికి తమ వ్యూహాన్ని చర్చించేందుకు ఇండియా బ్లాక్ ఎంపీలు సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో సమావేశమయ్యారు.

# రైతులు పంట గురించి ఆలోచించాలే తప్ప ఆందోళన చెందకూడదు

(మొదటిపేజీ తరువాయి)

వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని, రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టిన 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 16.48 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించామని, ప్రకాశం జిల్లాలోనే 3,304 ఎకరాల భూ సమస్యలను పరిష్కరించి 7,980 కుటుంబాల ఆశలను నిజం చేశామని తెలిపారు. గర్భకండ్రిగ వంటి ఏళ్లనాటి భూములకు సైతం విముక్తి కల్పించామన్నారు. భూ రికార్డులన్నీ డిజిటలైజ్ చేసి, బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భద్రపరిచామని, రైతులు తమ ఇంటి నుంచే తమ భూమి వివరాలను ఫోన్‌లో చూసుకోవచ్చని చెప్పారు. ప్రతి నెలా 9వ తేదీన ఈ కార్యక్రమ పురోగతిని తానే స్వయంగా సమీక్షిస్తానని, అవినీతికి ఆస్కారం లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

**ప్రాజెక్టులకు శంకుస్థాపన.. అభివృద్ధికి బాటలు**

ఈ పర్యటనలో భాగంగా, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్ నిర్మాణానికి, పాలేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 9,500 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాల్లోని 30,000 మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను నీళ్లు విడుదల చేశాకే జాతికి అంకితం చేశామని, ఫేజ్-2ను కూడా పూర్తి చేసి ఏటా నీళ్లిచ్చే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాబోయే మూడేళ్లలో రూ.36 వేల కోట్లతో 35 ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. రామాయపట్నం పోర్టును వేగంగా పూర్తి చేస్తున్నామని, బీపీసీఎల్ రూ.50 వేల కోట్ల పెట్టుబడితో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయని అన్నారు. దోనకొండను కీలక పారిశ్రామిక టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.

**వేదికపైనే 'పబ్లిక్ ఆడిట్'.. అధికారులకు చురకలు**

ఈ సభలో అందరి దృష్టినీ ఆకర్షించిన ప్రధాన ఘట్టం.. చంద్రబాబు వేదికపైనే నిర్వహించిన 'పబ్లిక్ ఆడిట్'. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను వేదికపైకి పిలిచి, ప్రజా స్పందన ఆధారంగా రూపొందించిన పనితీరు గణాంకాలను (పెర్ఫార్మెన్స్ డేటా) చదివి వినిపించారు. రాష్ట్ర సగటుతో పోలిస్తే ప్రకాశం జిల్లా, కొండేపి నియోజకవర్గం ఏయే అంశాల్లో వెనుకబడి ఉందో అంకెలతో సహా వివరించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా (-7.93%), రవాణా శాఖ పన్నులు (-7.32%), రీ-సర్వే (-7.53%), అంగన్‌వాడీ సేవలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటి అంశాల్లో ప్రతికూల పనితీరుపై అధికారులను నేరుగా ప్రశ్నించారు. "మీరు సరిగా పనిచేయకపోతే ప్రజలు నన్ను నిందిస్తారు. మీవల్ల నేను మాట పడాలా? పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అదే సమయంలో గృహ నిర్మాణం (హౌసింగ్), ఇసుక సరఫరా, మత్స్యకార భరోసా వంటి అంశాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన అధికారులను అభినందించారు.

**నాలుక చెప్పిందని కాకుండా, మంచి ఆహారం తీసుకోవాలి**

రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చంద్రబాబు తెలిపారు. ఆరోగ్యమే అసలైన సంపద అని, తాను రోజూ మూడు కోడిగుడ్లలోని తెల్లసొనతో చేసిన ఆమ్లెట్ తింటానని, అదే తన ఆరోగ్య రహస్యమని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ వంటగదినే ఔషధశాలగా మార్చుకోవాలని, నాలుక చెప్పిందని కాకుండా శరీరానికి ఏది మంచిదో అదే తినాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేసి, సరైన సమయంలో మందులు వేసుకునేలా గుర్తుచేసే వ్యవస్థను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

**సంక్షేమం, రాజకీయ అంశాలపై వ్యాఖ్యలు**

ఎన్డీఏ ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ వేగంతో పనిచేస్తోందని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి ట్రిబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాన్ని మరింత వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలైన పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏటా మూడు ఉచిత సిలిండర్లు, అన్నదాత సుఖీభవ వంటివి విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ, తాము 34 శాతానికి పెంచితే, ప్రత్యర్థులు కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారని ఆరోపించారు. కోర్టు తీర్పు ఎలా ఉన్నా, పార్టీపరంగా 34 శాతం కంటే ఎక్కువ సీట్లు బీసీలకు ఇచ్చి వారి రాజకీయ ఎదుగుదలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

**నేను నీతిమంతుడిగా ఉంటే సరిపోదు**

నీతివంతమైన రాజకీయాలు చేయడమే తన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "నేను నీతివంతుడిగా ఉంటే సరిపోదు, నా కింద పనిచేసే అధికార యంత్రాంగం, రాజకీయ నాయకులు కూడా అవినీతికి దూరంగా ఉండాలి. చిత్రగుప్తుడిలా అందరి ఖాతాలను రాసుకుంటు న్నాను. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎవరినైనా ఉపేక్షించేది లేదు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగితే ఎవరికీ తెలియదనుకోవడం భ్రమ. నేను 360 డిగ్రీల కోణంలో అందరినీ గమనిస్తున్నాను" అని హెచ్చరించారు. ప్రజాసేవకుడిగా ప్రజల బాగోగులే తనకు ముఖ్యమని, దేశభక్తిని, రాష్ట్రంపై అభిమానాన్ని పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని కోరారు. అంతిమంగా, ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడమే తన ఆశయమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

## నోయిడా విమానాశ్రయానికి ప్రధాని మోదీ పేరు..

- యోగి సర్కారు కీలక నిర్ణయం!
- పేరుమార్పు తీర్మానానికి యోగి మంత్రివర్గం ఆమోదం
- మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితం పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్ణయం
- మోదీకి రాష్ట్రంతో ప్రత్యేక అనుబంధం ఉందన్న యోగి
- విమానాశ్రయం తొలి దశను మార్చిలో ప్రారంభించిన ప్రధాని మోదీ
- తొలి దశలో ఏడాదికి 1.2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు

లక్నో - సూర్య వాస్తవం

ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో ఉన్న జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును మార్చాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై ఈ విమానాశ్రయాన్ని 'నరేంద్ర మోదీ అంతర్జాతీయ విమానాశ్రయం'గా పిలవనున్నారు. ప్రధాని మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గం తీర్మానాన్ని ఆమోదించిందని తెలిపారు. శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మొత్తం 39 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అనంతరం మీడియాతో మాట్లాడిన యోగి.. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌తో ప్రధానికి ప్రత్యేక అనుబంధం ఉందని, వారణాసి నుంచి ఎంపీగా ఎన్నికైన ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతోందని చెప్పారు. 2017కు ముందు రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు అంతంతమాత్రం గానే ఉండేవని యోగి పేర్కొన్నారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్‌వేలు, జాతీయ రహదారులు, మెట్రో, రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థలతో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగయ్యాయని తెలిపారు. అయోధ్య రామమందిర నిర్మాణం, కాశీ విశ్వనాథ్ కారిడార్ అభివృద్ధి వంటి కార్యక్రమాలను కూడా ప్రస్తావించారు. జెవార్‌లో నిర్మిస్తున్న నోయిడా విమానాశ్రయం ఉత్తర్‌ప్రదేశ్‌కు అందించిన గొప్ప బహుమతిగా యోగి అభివర్ణించారు. ఇది భవిష్యత్తులో దేశంలోనే కీలక విమానయాన కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విమానాశ్రయం తొలి దశను ప్రధాని మోదీ ఈ ఏడాది మార్చిలో ప్రారంభించారు. మొదటి దశలో ఏడాదికి సుమారు 1.2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యం ఉండనుంది. నాలుగు దశల నిర్మాణం పూర్తయితే ఆసియాలోనే అతిపెద్ద విమానాశ్రయాల్లో ఒకటిగా నిలవనుంది.

## కరవుపై 12న మంత్రులతో రేవంత్‌రెడ్డి సమీక్ష

- ఎల్ నినో ప్రభావంతో 17శాతం తగ్గిన వర్షపాతం
- రాష్ట్రంలోని 320 మండలాల్లో తీవ్ర కరవు ప్రభావం
- కేంద్రం నుంచి రూ.20,000 కోట్ల ప్యాకేజీ కోరిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్ - సూర్య వాస్తవం

తెలంగాణలో నెలకొన్న తీవ్ర కరవు పరిస్థితులు, సహాయక చర్యలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు. అక్టోబర్ 12న మంత్రులతో ప్రత్యేకంగా భేటీ అయి, రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం, దాని పర్యవసానాలపై ఆయన సమీక్ష జరపనున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా వర్షాభావ ప్రాంతాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం తక్షణమే చేపట్టాల్సిన చర్యలపై లోతుగా చర్చిస్తారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ వంటి కీలక అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. ఎల్ నినో ప్రభావంతో ఈసారి రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అక్టోబర్ 6 నాటి ప్రాథమిక అంచనాల ప్రకారం.. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలకు గాను 18 జిల్లాల్లోని 320 మండలాల్లో తీవ్ర కరవు ఛాయలు అలుముకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 621 మండలాల్లో దాదాపు సగం మండలాలు కరవు ప్రభావానికి గురైనట్లు అధికారిక వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, రాష్ట్రాన్ని కరవు పీడిత ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. తక్షణ సహాయం కింద రూ. 20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది. మంత్రివర్గ ఉపసంఘం చేపడుతున్న చర్యలు, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు, రైతు సంఘాలు, నిపుణుల నుంచి సలహాలు స్వీకరించడం వంటి అంశాలు కూడా ఈ భేటీలో చర్చకు వచ్చే అవకాశం ఉంది.

మరోవైపు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశించిన 12 ప్రామాణిక అంశాల ఆధారంగా అక్టోబర్ చివరి నాటికి సమగ్ర కరవు నివేదికను సిద్ధం చేయాలని ఆయన సూచించారు.

# టీచర్ల సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఏపీటీఎఫ్

**- ఎంఈఓకు ఏపీటీఎఫ్ మండల శాఖ వినతి**



**బెలుగుప్ప - సూర్య వాస్తవం :**మండలంలోని ఉపాధ్యాయుల సర్వీసు సంబంధిత పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ బెలుగుప్ప మండల శాఖ తరపున మండల విద్యాశాఖాధికారి గోవిందరాజులుకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్వీసు రిజిస్టర్ల నవీకరణ, వేసవి సెలవుల్లో శిక్షణలు, పరీక్షలు, ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు అర్హమైన సంపాదిత సెలవుల నమోదు, ఉద్యోగుల ఆరోగ్య పథకం, ఏపీజీఎల్ఐ, నిధి పోర్టళ్లలో పెండింగ్ అభ్యర్థనల ఆమోదం వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారాన్ని తగ్గించాలని, జీతాలు, కరవు భత్యం బకాయిలు, సంపాదిత సెలవులు, అనుబంధ బిల్లుల కార్యాలయ ప్రతులను భద్రపరచాలని, ఇంక్రిమెంట్లు, వైద్య సెలవులు తదితర ఉత్తర్వుల ప్రతులను సంబంధిత ఉపాధ్యాయులకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే అన్ని చెల్లింపులకు సంబంధించి ఆదాయపు పన్ను మినహాయింపుల వివరాలను ప్రతి త్రైమాసికానికి సక్రమంగా నమోదు చేయాలని,వివిధ రీమార్కులతో సిఎస్సి నుండి రిజెక్ట్ అయి ఈహెచ్ఎస్ లాగిన్ లో పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను తక్షణమే క్లియర్ చేయాలని కోరారు.ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి, పెండింగ్ సమస్యల పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణ రూపొందించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల సర్వీసు సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ 1938 బెలుగుప్ప మండల శాఖ కోరింది. ఎం.ఈ.ఓ కు వినతి ఇచ్చిన వారిలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఫ్యాప్టో చైర్మన్ శ్రీనివాస్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు వజీర్ భాష, జిల్లా మహిళా నాయకురాలు సరిత, మండల గౌరవ అధ్యక్షులు సూర్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లప్ప, మండల నాయకులు రాజమోహన్, మహబూబ్ ఖాన్, వెంకట సురేష్, మురళీ మనోహర్, ప్రేమ్ కుమార్, జనార్దన్, సునీల్, షాషావలి, నాగార్జున రెడ్డి, సురేష్ బాబు, పి. వెంకటేష్ నాయక్, వన్నూరు స్వామి, నరసింహులు, మహేష్, నల్లప్ప రెడ్డి,ఎం. వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పామిడి నూతన సీఐని మర్యాదపూర్వకంగా కలిసిన పెట్రోలు బంకు మేనేజర్ రామంజి



**పామిడి- సూర్య వాస్తవం :** పామిడి మండలంకు నూతనంగా బదిలీపై వచ్చిన సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. మనోహర్ ని,జై కిసాన్ పెట్రోల్ బంక్ మేనేజర్ జి.కొట్టాల గ్రామానికి చెందిన వాల్మీకి రామాంజినేయులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పామిడి మండల ప్రాంతంలో ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నుంచి తమవంతు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

## దసరా సెలవుల్లో పిల్లల భద్రతపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి..

**- తల్లిదండ్రులకు కనేకల్ ఎస్ఐ నాగమధు విజ్ఞప్తి..**



**కనేకల్ - సూర్య వాస్తవం :** దసరా పండుగ సెలవుల నేపథ్యంలో మండలంలోని తల్లిదండ్రులు తమ చిన్నారుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కనేకల్ ఎస్సై నాగమధు విజ్ఞప్తి చేశారు. పండుగ సెలవుల్లో పిల్లలు ఆటపాటలతో బయట గడిపే సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ముఖ్యంగా గ్రామాల్లోని చెరువులు, బావులు, కాలువలు, ఇతర నీటి వనరుల వద్దకు పిల్లలు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. చిన్నారులకు నీటి లోతుపై సరైన అవగాహన లేకపోవడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల పిల్లలను ఒంటరిగా బయటకు పంపకుండా, వారు ఎక్కడ ఆడు కుంటున్నారో తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు.పండుగ సెలవులను పిల్లలు సంతోషంగా, సురక్షితంగా గడిపేలా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై నాగమధు కోరారు. ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులపై తనిఖీ..

**- కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీవో,**

**ఎస్ఐ శివ తహసీలార్ అనిల్ సంయుక్త పరిశీలన**



**బెళుగుప్ప - సూర్య వాస్తవం:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో లక్ష్మీ నారా యణ, ఎస్ఐ శివ తహసీలార్ అనిల్ శుక్రవారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సంయుక్తంగా సందర్శించి, అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, ఎన్నికల సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయా లేదా అనే అంశాలను తనిఖీ చేశారు. ఎన్నికల నిర్వహణకు అనుగుణంగా కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి, పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టడమే లక్ష్యంగా అధికారులు ఈ తనిఖీలు నిర్వహించారు.

# భారతీయ ఐటీ దిగ్గజాలకు అమెరికా షాక్!

- **గ్రీన్‌కార్డు ప్రక్రియలో కీలక ఆంక్షలు..**
- **ఎనిమిది టెక్ సంస్థలపై ట్రంప్ ప్రభుత్వం చర్యలు**
- **భారతీయ టెకీల భవిష్యత్తుపై ప్రభావం ఎంత?**
- **ట్రంప్ వలస విధానం.. భారతీయ టెకీలకు కొత్త సవాళ్లు**




**అనంతపురం ప్రత్యేక కథనం - సూర్య వాస్తవం :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం విదేశీ ఉద్యోగుల వలస విధానాలపై కఠిన చర్యలకు దిగింది. ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డుల ప్రక్రియలో కీలకమైన పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ (పెర్మ్) కార్యక్రమం నుంచి ఎనిమిది ప్రముఖ సాంకేతిక, ఐటీ సేవల సంస్థలను సస్పెండ్ చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ జాబితాలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్ ), ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్, కాగ్నిజెంట్, క్యాప్‌జెమినీతో పాటు మైక్రోసాఫ్ట్, అడోబ్ సంస్థలు ఉన్నాయి. ఈ పరిణామం అమెరికాలో పనిచేస్తున్న భారతీయ సాంకేతిక నిపుణుల్లో ఆందోళనకు కారణమైంది.

### అమెరికా ఉద్యోగులకే ప్రాధాన్యం

అమెరికా కార్మిక శాఖ అధికారుల ప్రకారం, విదేశీ ఉద్యోగుల నియామకంలో అక్రమాలు, వేతనాల సంబంధిత ఉల్లంఘనలు, అమెరికా ఉద్యోగుల అవకాశాలకు నష్టం కలిగించే విధానాలపై జరుగుతున్న దర్యాప్తుల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు. అమెరికా ఉద్యోగులకు ప్రాధాన్యత కల్పించడం, వలస కార్యక్రమాల దుర్వినియోగాన్ని అరికట్టడం తమ లక్ష్యమని ట్రంప్ ప్రభుత్వం పేర్కొంటోంది.అయితే, సంస్థలపై వచ్చిన ఆరోపణలు నిరూపితమైన నేరాలు కావు. దర్యాప్తు కొనసాగుతున్నంత మాత్రాన ఆయా సంస్థలు తప్పు చేసినట్లు నిర్ధారణ అయినట్లుగా భావించరాదు.

### పెర్మ్ కార్యక్రమం అంటే ఏమిటి?

అమెరికాలో ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డు పొందే ప్రక్రియలో పెర్మ్ కీలకమైన దశ. విదేశీ ఉద్యోగికి శాశ్వత నివాస హోదా కోసం స్పాన్సర్ చేయాలనుకునే యజమాని, సాధారణంగా ఆ ఉద్యోగానికి తగిన అమెరికా ఉద్యోగులు అందుబాటులో లేరని, విదేశీ ఉద్యోగి నియామకం వల్ల స్థానిక ఉద్యోగుల వేతనాలు, పని పరిస్థితులపై ప్రతికూల ప్రభావం ఉండదని నిరూపించాల్సి ఉంటుంది.ఈ ప్రక్రియ నిలిచిపోవడంతో ప్రభావిత సంస్థల్లో పనిచేస్తూ గ్రీన్‌కార్డు దరఖాస్తుల కోసం ఎదురుచూస్తున్న కొందరు ఉద్యోగులకు జాప్యం ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే, ఈ చర్య వల్ల ఇప్పటికే ఉన్న హెచ్-1బీ వీసాలు లేదా మంజూరైన గ్రీన్‌కార్డులు ఆటోమేటిక్‌గా రద్దు కావు.

### భారతీయ టెకీలపై ప్రభావం ఎంత?

గ్రీన్‌కార్డు ప్రక్రియ ప్రారంభించాల్సిన ఉద్యోగులకు ఈ నిర్ణయం ఇబ్బందులు కలిగించవచ్చు. ముఖ్యంగా హెచ్-1బీ వీసా గడువు ముగింపునకు దగ్గరగా ఉన్నవారికి, ఉద్యోగ ఆధారిత శాశ్వత నివాస ప్రక్రియపై ఆధారపడుతున్నవారికి అనిశ్చితి పెరిగే అవకాశం ఉంది.అయితే, భారతీయ ఐటీ సంస్థలపై తక్షణ ఆర్థిక ప్రభావం ఎంత ఉంటుందనే అంశంపై భిన్న అంచనాలు ఉన్నాయి. రాయిటర్స్ నివేదిక ప్రకారం, భారతీయ ఐటీ సంస్థలు ఇప్పటికే ఈ మార్గంపై ఆధారపడటాన్ని తగ్గించుకున్నందున తక్షణ ప్రభావం పరిమితంగా ఉండవచ్చని విశ్లేషకులు అభిప్రాయప డుతున్నారు. మరోవైపు, దీర్ఘకాలంలో ఉద్యోగుల నిలుపుదల, నియామకాలు, సిబ్బంది ప్రణాళికలపై ప్రభావం పడే అవకాశాన్ని తోసిపుచ్చలేము.

### భారత్ ఆందోళన

అమెరికా సాంకేతిక రంగంలో భారతీయ నిపుణుల పాత్రను విస్మరించలేమని భారత ప్రభుత్వం పేర్కొంది. భారతీయ నిపుణులు అమెరికా ఆర్థిక వ్యవస్థ, సాంకేతిక ఆవిష్కరణలకు గణనీయమైన సహకారం అందిస్తున్నారని, వారిపై చేసిన సాధారణీకరణలు సముచితం కాదని భారత విదేశాంగ శాఖ స్పందించినట్లు రాయిటర్స్ నివేదించింది.

### న్యాయం, పారదర్శకతే కీలకం

దేశీయ ఉద్యోగులకు ప్రాధాన్యత కల్పించడం అమెరికా ప్రభుత్వ విధాన లక్ష్యమైనప్పటికీ, ఆరోపణలపై నిష్పాక్షిక దర్యాప్తు, సంస్థలకు తమ వాదనలు వినిపించే అవకాశం, చట్టబద్ధంగా పనిచేస్తున్న ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కూడా అంతే ముఖ్యం. ఈ సస్పెన్షన్ల కాలపరిమితి, తదుపరి చట్టపరమైన పరిణామాలు, ప్రభావిత దరఖాస్తుల స్థితిని బట్టి భారతీయ ఉద్యోగులపై దీర్ఘకాలిక ప్రభావం స్పష్టమయ్యే అవకాశం ఉంది. గ్రీన్‌కార్డు ప్రక్రియపై అమెరికా తీసుకున్న ఈ చర్య భారతీయ ఐటీ నిపుణులకు కొత్త సవాళ్లను తెచ్చిపెట్టింది. అయితే, వీసాల రద్దు, ఉద్యోగాల కోతలు తప్పనిసరిగా జరుగుతాయని భావించకుండా, అధికారిక నిర్ణయాలు, తదుపరి పరిణామాలను గమనించడం అవసరం.

**- డా. ముచ్చుకోట సురేష్ బాబు**

# అధిక వడ్డీలను వసూలు చేస్తున్న శ్రీరామ్ ఫైనాన్స్‌పై చర్యలు తీసుకోవాలి

- **లోన్ అప్రూవల్ పేరుతో రూ.లక్ష వసూలు!**
- **శ్రీరామ్ ఫైనాన్స్ కార్యాలయం ఎదుట ఏఐవైఎఫ్, రైతు సంఘం, ఏఐఎస్ఎఫ్ ధర్నా**
- **అధిక వడ్డీలు, అదనపు వసూళ్లపై నాయకుల ఆగ్రహం**
- **రాయదుర్గం బ్రాంచ్‌పై ఆర్‌బీఐ సమగ్ర విచారణ జరపాలి**
- **డీఎం, మేనేజర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్**






**రాయదుర్గం, సూర్య వాస్తవం ప్రత్యేక కథనం :** దుర్గం రుణాల పేరుతో అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థపై బాధితులు, ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణం మంజూరు చేసే సమయంలోనే రూ.లక్ష కమీషన్‌గా వసూలు చేశారని ఆరోపించారు. ఈ మేరకు రాయదుర్గం-కనేకల్ రోడ్డులోని శ్రీరామ్ ఫైనాన్స్ కార్యాలయం ఎదుట బాధితుడు డా. హెచ్.హెచ్. రంగస్వామి ( బిఎఎంఎస్ )తో కలిసి ఏఐవైఎఫ్, ఏపీ రైతు సంఘం, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు.

చిరు వ్యాపారులు, రైతులు, ఆటో డ్రైవర్లు, ఉద్యోగుల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీల పేరుతో ఫైనాన్స్ సంస్థలు ఇబ్బందులకు గురిచేస్తున్నా యని నాయకులు ఆరోపించారు. రుణగ్రహీతల నుంచి వసూలు చేస్తున్న మొత్తాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

### రూ.30 లక్షలు చెల్లించినా.. ఇంకా రూ.46 లక్షలు కట్టాలంటున్నారని ఆరోపణ

బాధితుడు డా. రంగస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. తన ఇంటిపై రెండు విడతల్లో రుణాలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. 2024 జనవరి 1న రూ.15 లక్షల రుణం తీసుకోగా, నెలకు రూ.52,450 చొప్పున 25 నెలల్లో రూ.13,06,350 చెల్లించినట్లు తెలిపారు. అలాగే, 2024 డిసెంబర్ 31న మరో రూ.35 లక్షల రుణం తీసుకోగా, నెలకు రూ.1,21,334 చొప్పున 15 నెలల్లో రూ.16,96,024 చెల్లించినట్లు పేర్కొన్నారు.

ఈ రెండు రుణాలకు కలిపి ఇప్పటివరకు సుమారు రూ.30 లక్షలు చెల్లించినప్పటికీ, రుణాన్ని పూర్తిగా ముగించేందుకు వెళ్లినప్పుడు ఇంకా రూ.46 లక్షలు చెల్లించాలని చెబుతున్నారని బాధితుడు ఆరోపించారు. తాను చెల్లించిన మొత్తాలు వడ్డీకే సరిపోలేదని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.

### రుణం పేరుతో అదనపు వసూళ్లు చేస్తున్నారని ఆరోపణ

రుణం మంజూరు చేయిస్తామంటూ డీఎం పేరు చెప్పి రూ.లక్ష కమీషన్‌గా తీసుకున్నారని, ఇన్సూరెన్స్ తప్పనిసరి అంటూ మరో రూ.50 వేలు వసూలు చేశారని నాయకులు ఆరోపించారు. వడ్డీ రేట్ల విషయంలోనూ స్పష్టత లేకుండా 1.80 శాతం, 1.45 శాతం అంటూ భిన్నంగా చెబుతున్నారని విమర్శించారు. ముందస్తుగా రుణం చెల్లించి ఖాతా ముగించేందుకు ప్రయత్నించినా వడ్డీలో మినహాయింపు ఇవ్వకుండా ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు.

### ఆర్‌బీఐ జోక్యం చేసుకోవాలి

ఈ ధర్నాలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కావలి కోట్రేష్, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి తిప్పేస్వామి, సీపీఐ రాయదుర్గం పట్టణ కార్యదర్శి రవి, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. రుణగ్రహీతల సమస్యలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

శ్రీరామ్ ఫైనాన్స్ రాయదుర్గం శాఖ వ్యవహారాలపై ఆర్‌బీఐ సమగ్ర విచారణ జరపాలని, ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత డీఎం, మేనేజర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. డా. రంగస్వామితో పాటు ఇతర బాధితులకు రుణాన్ని ముందుగానే ముగించే సమయంలో నిబంధనల ప్రకారం వడ్డీ మినహాయింపులు కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే శ్రీరామ్ ఫైనాన్స్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కుమార్ నాయక్, గోపీనాథ్, భాను, ఉత్తమ్, వినీత్, నవీన్, జశ్వంత్, మనోజ్, రమేష్, మలేష్, విరంజీ తదితరులు పాల్గొన్నారు.

# పేద రోగులకు అండగా వీల్‌చైర్ బ్యాంక్ కార్యక్రమం

**- డిస్కవరీ అనిల్ కుమార్ !**

**- అనంతపురం సర్వజన ఆస్పత్రికి 10 వీల్‌చైర్లు అందజేత**

**- ఆస్పత్రి అభివృద్ధికి సహకరిస్తాం.. పింక్ టాయిలెట్ల నిర్మాణం చేపడతాం: టి.సి. వరుణ్**





**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం :** పేద రోగులకు అండగా నిలవాలనే లక్ష్యంతో వీల్‌చైర్ బ్యాంక్ బృహత్తర కార్యక్రమంలో భాగంగా అనంతపురం సర్వజన ఆస్పత్రికి 10 వీల్‌చైర్లను ఉమ్మడి అనంతపురం జిల్లా జనసేన అధ్యక్షులు, అహుడ చైర్మన్ టి.సి. వరుణ్ అందజేశారు. ఈ సందర్భంగా వీల్‌చైర్ల అందజేతకు సహకరించిన అనంతపురం డిస్కవరీ అనిల్ కుమార్‌కు వరుణ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో పేద రోగులకు అండగా నిలుస్తామని, ఆస్పత్రి అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని టి.సి. వరుణ్ పేర్కొన్నారు. ఆస్పత్రిలో పింక్ టాయిలెట్ల నిర్మాణాన్ని కూడా చేపట్టి తీరుతామని హామీ ఇచ్చారు.ఆస్పత్రికి 10 వీల్‌చైర్లు అందించిన టి.సి. వరుణ్‌కు సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర, జిల్లా కమిటీ సభ్యులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, జనసేన నాయకులు, వీరమహిళలు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.10 లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

**- అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం**

**- ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఈశ్వర్**



**పామిడి- సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలో 6, 7వార్డుల లో పల్లె పండుగ 3, 0 కార్యక్రమంలో భాగంగా 10 లక్షల రూపాయలతో నూతన సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం ఆయన తనయుడు పామిడి ఇన్చార్జ్ గుమ్మ నూరు ఈశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొని రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు అనంతరం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరం అయిన సందర్భంగా ఎక్కడ చూసినా రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి మంత్రంగా పనిచేయడం జరిగిందని అదేవిధంగా మన నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి వాటిని పూర్తి చేయడం కూడా జరిగిందని కూటమి ప్రభుత్వం అంటేనే అభివృద్ధికి మారుపేరని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బొల్లు శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్ చౌదరి, జింకల సంజీవ, జనసేన ధనుం జయ, శివ, రామకృష్ణ,మండల కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యా మందిరంలో ఘనంగా సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం

**పామిడి- సూర్య వాస్తవం :** స్థానిక పామిడి పట్టణ పరిధిలో సరస్వతి విద్యా మందిరం లో సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా 25 కోట్ల చిన్నారుల కలల చిత్రలేఖ పోటీలి .ప్రధానాచార్యులు సి.ఆర్. శ్రీనివాసరావు బీజేపీ మండల అధ్యక్షులు చౌహాన్ అంజి నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి ఈ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు బీజేపీ రాష్ట్ర ఆల్ సేల్స్ కన్వీనర్ ఎక్స్ ఆర్మీ జేసీ కణంపల్లి చిరంజీవి రెడ్డి అనంతపూర్ జిల్లా బీజేపీ అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ పాల్గొన్నారు ఈ చిత్రలేఖ పోటీలో సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 6,7,8 తరగతులకు ఒక విభాగంగా, 9,10 తరగతులకు మరో విభాగంగా పోటీలు నిర్వహించడం జరిగింది. గెలుపొందిన విద్యార్థులకు 6,7,8 తరగతులు హర్షద్ కుమార్, వైష్ణవి9,10 తరగతులు ఉషశ్రీ జయలక్ష్మి, మహీధర్ రెడ్డి,ముకేష్ రెడ్డి, కరిష్మా, హిమబిందు బహుమతులు అందు కున్నారు. ఈ కార్యక్రమంలో గార్లదిన్నె బీజేపీ మండల అధ్యక్షులు చాణిక్య ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్ కుమార్ పవన్ కుమార్, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ మెంబర్ పూజారి లక్ష్మీదేవి రాజశేఖర్ గౌడ్ ఆర్ఎస్ఎస్ పెద్దలు పుల్లా చౌదయ్య యువ మోర్చా మండల అధ్యక్షులు నరేంద్ర విష్ణుకాంత్ రావు ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు నరేష్ యాదవ్, రామ్ నరేష్ సరస్వతి విద్యా మందిరం ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ భారతీయ జనతా పార్టీ తరపున ధన్యవాదాలు తెలిపారు.



# ప్రతి ఇంటికీ వెళ్లాలి.. ప్రతి మనిషినీ కలవాలి

**- ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి: ఎమ్మెల్యే కాలవ**



**రాయదుర్గం - సూర్య వాస్తవం :** ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు పోటీ చేసే ప్రతి స్థానంలో అఖండ మెజారిటీతో విజయం సాధించేలా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రతి ఒక్కరినీ కలవాలని పేర్కొన్నారు. గుమ్మగట్ట మండలం మారేంపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కాలవ పాల్గొన్నారు. గ్రామంలో సీసీ రోడ్డు, గోకులం షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం గ్రామంలో నిర్మించిన గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేయడంతో పాటు ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఐదేళ్ల వైసీపీ అరాచక, విధ్వంసకర పాలనకు 2024 ఎన్నికల్లో ఓటర్లు చరమగీతం పాడి, చంద్రబాబు నాయకత్వంలోని కూటమి పాలనకు స్వాగతం పలికారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం గణనీయమైన పురోగతి దిశగా పరుగులు తీస్తోందన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళు న్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ తదితర ప్రతి స్థానంలో కూటమి అభ్యర్థులు గెలుపొందినప్పుడే గ్రామాల అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ప్రజలు ఎల్లప్పుడూ సుఖ శాంతులతో, ప్రశాంతంగా జీవించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పమన్నారు. పేదవాడు గౌరవంగా తలెత్తుకుని జీవించాలన్న లక్ష్యంతో ఆయన నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలని, ప్రతి పేద కుటుంబం ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందాలని ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 'సూపర్ సిక్స్' హామీల్లో దాదాపు అన్నింటినీ అమలు చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాది రూపాయల వ్యయంతో సిమెంట్ రోడ్లు, తారు రోడ్లు, పాఠశాల భవనాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రైతుల కోసం గోకులం షెడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా నిధులు ఖర్చు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రతి ఒక్కరికీ తెలిసేలా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వివరించాలని సూచించారు. మనం చేస్తున్న మంచి పనులను ప్రజలకు చెప్పుకోకపోతే సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీలు కూటమి ప్రభుత్వంపై లేనిపోని నిందలు, ఆరోపణలు చేస్తూ వాటినే నిజమని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తాయని గుర్తు చేశారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వాస్తవాలను ప్రజలకు నిర్భయంగా వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల ఆశీర్వాదాలు, దీవెనలు ఎల్లప్పుడూ మెండుగా ఉండాలని ఎమ్మెల్యే కాలవ విజ్ఞప్తి చేశారు.



**మారేంపల్లికి ఎమ్మెల్యే వరాలు..**

కష్టకాలంలో తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచిన బలమైన నాయకత్వం మారేంపల్లి గ్రామ సొంతమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కొనియాడారు. అన్నివేళలా పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తూ, పార్టీని ముందుకు నడిపించడంలో గ్రామస్తులు చేసిన కృషి అభినందనీయ మన్నారు. అందుకే గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. గ్రామంలో రైతుల కోసం అత్యధిక సంఖ్యలో గోకులం షెడ్లు నిర్మించడంతో పాటు రూ.60లక్షలతో సీసీ రోడ్లు, గ్రామీణ ఆరోగ్య కేంద్రం, ఉన్నత పాఠశాలను మంజూరు చేయించామని చెప్పారు. గ్రామస్తుల కోరిక మేరకు మారెమ్మ గుడి రోడ్డు నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా పాఠశాలకు దేవాలయ భూమిని కేటాయించే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. గ్రామంలో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కాలువ సన్నన్న,మాజీ కన్వీనర్ కురుబ గిరిమల్లప్ప, మాజీ సర్పంచ్ కురుబ జ్యోతి, రామంజినేయులు, ఉస్మాన్ సాబ్, యూనిట్ ఇంఛార్జి సంజీవ,గొల్ల వెంకటేశులు,కేపి దొడ్డి నాగరాజు, కురుబ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు వ్యవసాయ అటవీ విధానంపై సేట్రీస్ అవగాహన

**- నీటి సంరక్షణ, మొక్కల మనుగడపై ప్రత్యేక దృష్టి**




**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురంలోని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో సేట్రీస్ ఎన్విరాన్‌మెంటల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అటవీ విధానం, మొక్కల పెంపకం, నీటి సంరక్షణ, నేల ఆరోగ్యం, సమగ్ర సస్యరక్షణ, రైతులకు వ్యవసాయ ఇన్‌పుట్స్ అందుబాటు వంటి అంశాలపై చర్చించారు.

**నీటి కొరతను అధిగమించేందుకు చర్యలు**

బోరుబావుల్లో నీటి లభ్యత తగ్గడం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా మొక్కల మనుగడకు ఎదురవుతున్న సమస్యలను సదస్సులో ప్రస్తావించారు. మొక్కలకు అవసరమైన నీటిని అందించడం, మొక్కల చుట్టూ మల్చింగ్ చేయడం, బోరుబావుల రీచార్జ్ చర్యలు చేపట్టడం ద్వారా నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**వ్యవసాయ అటవీ విధానంతో రైతులకు అదనపు ఆదాయం**

రైతులకు అనువైన చెట్ల జాతుల ఎంపిక, మొక్కల మధ్య సరైన దూరం, బ్లాక్ ప్లాంటేషన్, కొమ్మల కత్తిరింపు, మొక్కలకు రక్షణ కల్పించడం, దీర్ఘకాలిక నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించారు. వ్యవసాయ భూముల్లో చెట్ల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు అదనపు ఆదాయం పొందే అవకాశాలను వివరించారు.

**నేల ఆరోగ్యం.. సమగ్ర సస్యరక్షణ**

మొక్కల పెరుగుదలకు అవసరమైన పోషకాలను అందించేందుకు సీవీడ్ ఎక్స్‌ట్రాక్ట్, చెరకు మొలాసిస్, మైకోరైజా, బయోపొటాష్ వంటి సిఫార్సు చేసిన వ్యవసాయ ఇన్‌పుట్స్ వినియోగంపై చర్చించారు. పంటలను ఆశించే తెగుళ్లు, పురుగులను ముందుగానే గుర్తించడం, వేప ఆధారిత ద్రావణాలను ఉపయోగించడం, పురుగుమందులను బాధ్యతాయుతంగా వినియోగించడం వంటి సమగ్ర సస్యరక్షణ పద్ధతులను వివరించారు.

**రైతులకు ఇన్‌పుట్స్ అందుబాటులోకి తీసుకురావడంపై చర్చ**

రైతులకు బయోపొటాష్ ఇన్‌పుట్స్‌ను సకాలంలో అందించేందుకు ఐఎఫ్ఎఫ్‌సీఓ (ఇఫ్కో ), స్థానిక డీలర్లతో సమన్వయం చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే జిల్లా సహకార నిర్వహణ సంస్థతో సమన్వయాన్ని బలోపేతం చేయడం ద్వారా వ్యవసాయ ఇన్‌పుట్స్, ప్రభుత్వ పథకాలు, సహకార సేవలు, మార్కెటింగ్ అవకాశాలను రైతులకు చేరువ చేయడంపై చర్చించారు.

**మొక్కల సంరక్షణకు కార్యాచరణ ప్రణాళిక**

ఇప్పటికే నాటిన మొక్కల మనుగడను పెంచేందుకు క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని నిర్ణయించారు. మొక్కలకు కంచెల ఏర్పాటు, పొలం గట్ల వెంట చెట్ల పెంపకం, నీటి సంరక్షణ, మల్చింగ్, పోషక యాజమాన్యం వంటి చర్యలను ప్రోత్సహించాలని సూచించారు. మొక్కల సంరక్షణలో సమస్యలు ఎదుర్కొంటున్న రైతుల పొలాలకు ప్రాధాన్యతనిస్తూ సాంకేతిక మార్గదర్శకత్వం అందించాలని కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.

**స్థిరమైన వ్యవసాయమే లక్ష్యం**

నీటి సంరక్షణ, నేల ఆరోగ్య పరిరక్షణ, సమగ్ర సస్యరక్షణ, మొక్కల నిరంతర పర్యవేక్షణ ద్వారా ప్లాంటేషన్‌లో మొక్కల మనుగడను మెరుగు పరచ వచ్చని సదస్సులో వివరించారు. రైతులకు అవసరమైన వ్యవసాయ ఇన్‌పుట్స్, సంస్థాగత సహకారం, మార్కెటింగ్ అవకాశాలు అందుబాటులోకి వస్తే వారి ఆదాయం పెరగడంతో పాటు స్థిరమైన వ్యవసాయ అటవీ విధానం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.



# బీసీ రిజర్వేషన్లపై చంద్రబాబుది నయవంచక వైఖరి

**- అంబేద్కర్ విగ్రహానికి వైసీపీ బీసీ విభాగం వినతిపత్రం**



**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం బీసీ రిజర్వేషన్ల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై వైసీపీ బీసీ విభాగం నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. బీసీల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ, న్యాయస్థానాలు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ మేరకు అనంతపురంలో భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు జీవో తీసుకొచ్చిన సమయంలో న్యాయపరమైన అభ్యంతరాలు ఎదురయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ల అంశంలో జరుగుతున్న పరిణామాలు బీసీలను అయోమయానికి గురిచేస్తున్నాయని విమర్శించారు. బీసీల సమస్యలపై వినతిపత్రం సమర్పించేందుకు వెళ్లిన వారిని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. బీసీలకు నిజంగా న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వ సహకారంతో పార్లమెంటులో చట్టపరమైన చర్యలు చేపట్టి, రిజర్వేషన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు వారి హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీల హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు తమ రాజకీయ చైతన్యాన్ని చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ బీసీ విభాగం రాష్ట్ర నాయకులు రమేష్ గౌడ్, బెస్త కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కె.వి. రమణ, రజక కార్పొరేషన్ మాజీ చైర్మన్ మీసాల రంగన్న తదితరులు పాల్గొన్నారు.

# కణేకల్‌లో పోలింగ్ కేంద్రాల తనిఖీ...

**- ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**

**- మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత పాటించాలి: అధికారుల సూచన**



**కణేకల్ - సూర్య వాస్తవం :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కణేకల్ గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను వివిధ శాఖల అధికారులు సంయుక్తంగా శుక్రవారం తనిఖీ చేసి, అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. తహశీల్దార్ బ్రహ్మయ్య, డి ఎల్ డి ఓ అమానుల్ల, ఎంపీడీవో విజయసింహారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో షెక్షావలి, ఈ ఓ ఆర్ డి చంద్రమౌళి, ఎస్ఐ నాగమధు తదితరులు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

**భద్రతా ఏర్పాట్లపై ఆరా**

ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, ఓటర్లకు కల్పించాల్సిన సౌకర్యాలను పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి**

అనంతరం కణేకల్ జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని తహశీల్దార్ బ్రహ్మయ్య పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. భోజనం నాణ్యత విషయంలో నిర్లక్ష్యం వహించ రాదని, విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో పవన్‌కుమార్, పంచాయతీ అభివృద్ధి అధికారి మంజుల, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలను పోలీసుల మార్కింగ్..

**- జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల విస్తృత తనిఖీలు**

**- సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు.. పటిష్ట భద్రతకు చర్యలు**

**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా పోలింగ్ కేంద్రాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన మౌలిక వసతులను అధికారులు పరిశీలించారు. విద్యుత్ సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాల పరిస్థితిని సమీక్షించారు. ఎన్నికల సమయంలో ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. ఆయా కేంద్రాల్లో శాంతిభద్రతల పరిస్థితులను సమీక్షిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై చర్చించారు. ఓటర్లు భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు అప్రమత్తతతో విధులు నిర్వహించాలని పోలీసు, రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



# చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ అవినీతి బాగోతం...!

**- ఆయన అవినీతి ఆదాయం నెలకు మూడు కోట్లు? రోజు కు పది లక్షలు?**
**- బంధువుల పేరిట స్థిరాస్తులు కొనుగోలు?**
**- అవినీతి ఆదాయం అంత శనివారం ఒక గూటికి, అక్కడ నుండి కుటుంబ సభ్యులు నివాసం ఉన్న చోటికి తరలింపు?**
**- ఏసిబి అధికారులకు సవాల్ దందా ఆపేది ఎవరు?**





**హిందూపురం - సూర్య వాస్తవం ప్రత్యేక కథనం:** హిందూపురం నియోజకవర్గ పరిధిలోని చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ అవినీతి ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. భూముల రిజిస్ట్రేషన్లలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలతో పాటు, భారీ మొత్తాల్లో ముడుపులు చేతులు మారుతున్నాయనే ప్రచారం స్థానికంగా కలకలం రేపుతోంది. అయితే ఈ ఆరోపణలపై అధికారిక విచారణ ద్వారా వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

**మరణించిన మహిళ భూమి రిజిస్ట్రేషన్‌పై ఆరోపణలు**

హిందూపురం నియోజకవర్గ పరిధిలోని దేమకేతేపల్లికి చెందిన ఓ మహిళా రైతు మరణించినప్పటికీ, ఆమె కుటుంబ సభ్యుల ద్వారా రూ.10 లక్షలు తీసుకుని 1909/26 నంబరు గల డాక్యుమెంట్‌ను రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో భూమి హక్కులు, సంబంధిత పత్రాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**పది ఎకరాల భూములకు లక్షల్లో ముడుపులా?**

చిలమత్తూరు మండల కేంద్రంలో అధిక ప్రభుత్వ విలువ కలిగిన కన్వర్షన్ భూములకు సంబంధించి పది ఎకరాల రిజిస్ట్రేషన్ కోసం రూ.8 లక్షలు లంచంగా తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా బూదిలి పరిధిలో ఢిల్లీకి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పది ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ కోసం రూ.5 లక్షలు చెల్లించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల చిలమత్తూరులోని 15 ఎకరాల 10 సెంట్ల భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారంలోనూ రూ.5 లక్షలు ముడుపులుగా తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 1928లో ప్రభుత్వం పట్టా ఇచ్చినట్లు చెబుతున్న ఈ భూమికి సంబంధించి పాత రికార్డులు, పట్టా వివరాలు, ప్రస్తుత రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలిస్తేనే వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

**నెలకు రూ.3 కోట్లా..? రోజుకు రూ.10 లక్షలా..?**

సబ్‌రిజిస్ట్రార్ అక్రమ ఆదాయం నెలకు రూ.3 కోట్ల వరకు ఉంటుందని, రోజుకు రూ.10 లక్షల మేర సంపాదిస్తున్నారనే ఆరోపణలు ప్రచారంలో ఉన్నాయి. అలాగే బంధువుల పేర్లపై స్థిరాస్తులు కూడబెట్టినట్లు, ఆరోపణల ద్వారా వచ్చిన సొమ్మును మొదట ఒకచోట చేర్చి, అక్కడి నుంచి కుటుంబ సభ్యులు నివసించే ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం ప్రచారంలో ఉంది. అయితే ఈ మొత్తాలు, ఆస్తుల వివరాలు, నగదు తరలింపునకు సంబంధించిన అంశాలు స్వతంత్రంగా నిర్ధారణ కావాల్సి ఉంది. సంబంధిత పత్రాలు, ఆస్తుల వివరాలు, ఆర్థిక లావాదేవీలను పరిశీలించినప్పుడే ఆరోపణల్లోని వాస్తవాలు బయటపడతాయి.

**ఏసీబీ విచారణతోనే నిజాలు వెలుగులోకి వస్తాయా?**

చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై వస్తున్న వరుస ఆరోపణల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికా రులు స్పందించి విచారణ చేపట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది. సంబంధిత భూముల రిజిస్ట్రేషన్ పత్రాలు, ప్రభుత్వ రికార్డులు, ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు పరిశీలించి నిజానిజాలను నిగ్గుతేల్చాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాల్సిన అవసరం ఉందని, భూముల రిజిస్ట్రేషన్లలో అక్రమాలు జరిగితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ వివరణ, అధికారిక విచారణ ఫలితాలు వెలువడితేనే పూర్తి వాస్తవాలు స్పష్టమవుతాయి.



# గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రిలో కష్టాలు ...

**- గార్లదిన్నె ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీల ఘోష..**
**- పనిచేయని ఫ్యాన్లు**
**- పట్టించుకునే నాథుడేరీ...?**
**- ఎమ్మెల్యే గారు మీరైనా ఇటువైపు చూడండి...!**



**గార్లదిన్నె- సూర్య వాస్తవం :** గార్లదిన్నె మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు సరిగా లేవని రోగులు ఆరోపిస్తున్నారు. ప్రతినెల 9వ తేదీన నిర్వహించే గర్భిణీల నెలవారీ పరీక్షకు 70 నుండి 80 మంది గర్భవతులు వచ్చారు. అయితే ఆసుపత్రిలో ఫ్యాన్లు తిరగకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు చేతిలో నెలసరి బుక్కులు పట్టుకుని విసనకర్ర వలే విసురుకుంటూ ఉక్కపోతతో పలుఅవస్థలు పడుతున్నామని బాధితులు వాపోతున్నారు. కొందరు గాలి ఆడక ఉక్కపోతకు తాళలేక గర్భిణీలు ఆసుపత్రి ఆవరణంలోని చెట్ల కింద కూర్చుంటున్నారు. వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ గదిలో మాత్రం ఫ్యాన్లు తిరుగుతున్నాయని, రోగులు కూర్చునే చోట మాత్రం ఫ్యాన్లు తిరుగలేదని గర్భిణీలు, స్థానికులు వైద్యాధికారిపై పలు విమర్శలను గుప్పిస్తున్నారు. ఆసుపత్రిలో ప్రత్యేకంగా శిశు సంక్షేమ వైద్యురాలిని నియ మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజానీకం కోరుతున్నారు. ఆసుపత్రిలోని సిబ్బందిని వైద్యాధికారి ఉదయ్ వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని, కుల భేదాలు చూపుతూ సిబ్బందిని రోగులను వేధిస్తున్నట్లు ప్రజలు వాపోతు న్నారు. లక్షలాది రూపాయలు వేతనాలు తీసుకుంటున్న వైద్య పర్యవేక్షకులు (సూపర్వైజర్లు) లోకనాథ్ నరసమ్మలు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లకుండా ఆసుపత్రిలోనే కూర్చుని కాలం గడుపుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వైద్యాధికారి వైఖరితో పేదలకు, గర్భిణీలు, బాలింతలకు ఇతర రోగులకు ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదని మండల ప్రజలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలకు రోగులు వస్తే కనీస సౌకర్యాలు కూడా లేవని, ఈయన వైఖరి పట్ల జిల్లా వైద్యాధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, మానవతా దృక్పథంతో రోగులకు వైద్య సేవలు అందించే డాక్టర్లను నియమించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.





# టిడ్కో గృహాలను పరిశీలించిన ఏపీ టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్



**పామిడి - సూర్య వాస్తవం :** జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ (ఏపీ టిడ్కో ) చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ పామిడిలో ఉన్నటువంటి టిడ్కో ఇళ్లను పరిశీలించడం జరిగినది ఈ సందర్భంగా ఆయన జరుగుతున్నటువంటి పనులను అధికారులను అడిగి తెలుసుకోవడం జరిగినది త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని దానికి అనుగుణంగా పనిచేయాలని అధికారులను ఆదేశించడం జరిగినది ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గుంతకల్ నియోజకవర్గం సమన్వయకర్త వాసగిరి మణికంఠ, జనసేన పార్టీ పామిడి మండల అధ్యక్షులు ధనుంజయ, బిజెపి మండల అధ్య క్షులు అంజి నాయక్ మండల నాయకులు వేణుగోపాల్, జగదీష్, సూర్యనారాయణ, రామాం జనేయులు, సిద్దయ్య, మురళి, జగదీష్, బాబావలి, రాఘవేంద్ర, సురేష్ కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని వారికి స్వాగతం పలికారు.

## సంస్కృతి సంప్రదాయాల సందడిలో
# చిన్నారుల దసరా వేడుకలు

**-నాయుడుపేట నారాయణ పాఠశాలలో ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు**



**నాయుడుపేట- సూర్య వాస్తవం:**నాయుడుపేటలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలతో సందడి చేశారు. దసరా పండుగ విశిష్టతను ప్రతిబింబించే కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల ఏజీఎం నూర్ రియాజ్, ప్రిన్సిపాల్ పి. మల్లికార్జున, ఏఓ గౌస్ బాషా, వైస్ ప్రిన్సిపాళ్లు, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు హాజరై విద్యార్థులను అభినందించారు. చిన్నారులు ఉత్సాహంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి. మల్లికార్జున మాట్లాడుతూ, విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను విద్యార్థులకు పరిచయం చేయడం కూడా పాఠశాల బాధ్యత అని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంతో పాటు వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని తెలిపారు. దసరా పండుగ చెడుపై మంచి, అధర్మంపై ధర్మం, అసత్యంపై సత్యం సాధించిన విజయానికి ప్రతీక అని విద్యార్థులకు వివరించారు. జీవితంలో సత్యం, ధర్మం, మంచితనం, ధైర్యం వంటి విలువలను పాటించాలని సూచించారు. చిన్నారుల సంప్రదాయ వేషధారణలు, నృత్య ప్రదర్శనలు, ఉత్సాహభరితమైన భాగస్వామ్యంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో వేడుకలు విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బందికి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసింది.

## హెచ్ఐవి/ఎయిడ్స్ పై
# అవగాహన సదస్సు



**సూళ్లూరుపేట -సూర్య వాస్తవం:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, దిశా విభాగం సహకారంతో శుక్రవారం నవజీవన్ ఆర్గనైజేషన్ - సి.సి - పి.యు ప్రాజెక్టు ఆధ్వర్యం లో "ఇంటెన్సిఫైడ్ ఐ.ఇ.సి క్యాంపెయిన్"కార్యక్రమం ద్వారా హెచ్ఐవి/ ఎయిడ్స్ పై అవగాహన సదస్సును సూళ్లూరుపేట లోని"జెడ్.పి.గర్ల్స్ హైస్కూల్" వి.యస్.యస్.సి.హోలీ క్రాస్ హైస్కూల్ మరియు శ్రీ రామక్రిష్ణ విద్యాలయ నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టు మేనేజర్ అయిన కె. బాలాజి మాట్లాడుతూ, హెచ్ఐవి/ ఎయిడ్స్ వ్యాప్తి కారకాలు,ఎలా వ్యాపించదు, లక్షణాలు, అవి రాకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తులు పట్ల వివక్షత,చిన్న చూపు లేకుండా ఎలాగ సమాజంలో కలిసి జీవించాలి,సుఖ వ్యాధులు మరియు చికిత్స గురించి,డ్రగ్స్ వాడకం వలన కలిగే ఇబ్బందులు, కండోమ్ యొక్క ఉపయోగం గురించి,హెచ్ఐవి/ఎయిడ్స్ యాక్ట్ 2017,ఏ.ఆర్.టి మందులు, ఏ.పి.శాక్స్ యాప్,క్యూ.ఆర్ కోడ్,సెల్ఫ్ రిస్క్ అసెస్ మెంట్,టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి తెలుపుతూ, మీ ద్వారా తెలియని వాళ్లకు తెలియజేయమని చెప్పడం జరిగింది. అవగాహన కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు, ఓ.ఆర్.డబ్ల్యూలు టి.నందిని, కె.మంజుల,పి.ఇలు, 200 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## స్థానిక ఎన్నికల దృష్ట్యా
## పోలింగ్ కేంద్రాలు తనిఖీలు

**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:**రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహించనున్న దృష్ట్యా అధికారులు ఏర్పాట్లుపై దృష్టి సారించారు. మండల పరిధిలో జడ్పిటిసి,ఐఎంపీటీసీ,సర్పంచి ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను సంసిద్ధం చేస్తున్నారు. శుక్రవారం తాసిల్దార్ రాజేంద్ర,ఎంపీడీవో గోవర్ధన్ నెల్లూరు పల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఓటర్లు ఓటును సద్వినియోగం చేసుకునేందుకు పాఠశాల పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించారు వెంటిలేషన్,వృద్ధులకు ర్యాంపు సౌకర్యం వంటి తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రాజేంద్ర, ఎంపీడీవో గోవర్ధన్,పోలీసు సిబ్బంది,పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## పల్లెల అభ్యున్నతే లక్ష్యం..
# పెళ్లకూరులో అభివృద్ధి పనులకు శ్రీకారం

- మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం - విజయశ్రీ
- పెళ్లకూరు మండలంలో ఒక్కరోజే రూ.4.44 కోట్ల పనులకు శ్రీకారం
- మూడు సీసీ రోడ్లకు భూమిపూజ.. నాలుగు తారురోడ్లు ప్రారంభం
- చిన్నారుల కోసం అంగన్‌వాడీ భవనాలు.. ప్రజాదర్బార్‌లో సమస్యలపై ఆరా
- ఎమ్మెల్యే విజయశ్రీకి గ్రామాల్లో ఘనస్వాగతం.. పూలవర్షంతో అభిమానం





**నాయుడుపేట- సూర్య వాస్తవం:** గ్రామీణ ప్రగతికి రహదారులు.. చిన్నారుల భవిష్యత్తుకు అంగన్‌వాడీ కేంద్రాలు.. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్.. ఇలా అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో కార్యక్రమాలు కొన సాగుతున్నాయి. ఇందులో భాగంగా పెళ్లకూరు మండలంలో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ విస్తృతంగా పర్యటించారు. ఒక్కరోజే ఏడు కార్యక్రమాల్లో పాల్గొని, రూ.4.44 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సంబంధించి భూమిపూజలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చేరుకున్న ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, ప్రజలు ఘనస్వాగతం పలికి పూలవర్షం కురిపించారు.

**రహదారుల నిర్మాణానికి రూ.4 కోట్లకు పైగా పనులు**



గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో గంగరాజు కండ్రిగ నుంచి చింతపూడి వరకు రూ.2.25 కోట్ల వ్యయంతో చేపట్టనున్న మూడు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే ఆయా గ్రామాల మధ్య రాకపోకలకు మరింత సౌలభ్యం కలగనుంది. ప్రజల రోజువారీ ప్రయాణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల అనుసంధానానికి రహదారులు కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం నెలబల్లి హరిదజనవాడ నుంచి గంగరాజు కండ్రిగ వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రూ.1.78 కోట్ల వ్యయంతో నిర్మించిన నాలుగు తారురోడ్లను ప్రారంభించారు. గ్రామీణ మౌలిక వసతుల బలోపేతంలో భాగంగా చేపట్టిన ఈ పనులు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

**చిన్నారుల భవిష్యత్తుకు అంగన్‌వాడీ భవనాలు**



చిన్నారులకు మెరుగైన వసతులతో విద్య, పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాల నూతన భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. చిల్లకూరు గ్రామంలో రూ.15.75 లక్షలతో, అక్కగారిపేట గ్రామంలో రూ.15.60 లక్షలతో నిర్మించిన భవనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు ప్రభుత్వం అందించిన యూనిఫారాలను పంపిణీ చేశారు. చిన్నారులకు ప్రీస్కూల్ పుస్తకాలు, ప్లేట్లు, గ్లాసులను అందజేశారు. చిన్నారుల ఎదుగుదలకు పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణతోపాటు నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్య ఎంతో అవసరమని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఈ సేవలను సమర్థంగా అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ కె. ఉమామహేశ్వరి, పెళ్లకూరు మండల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె. సాయిశ్రీలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, చిన్నారుల తల్లులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**ఎగువ చావలిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా ఎగువ చావలి గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో స్థానిక అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పల్లెల్లో అవసరమైన సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన జీవన పరిస్థితులు కల్పించవచ్చన్నారు.

**ప్రజల వద్దకే వెళ్లి సమస్యలపై ఆరా**



అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే ఉద్దేశంతో నెలబల్లి భీమవరం గ్రామంలో ఎమ్మెల్యే ప్రజాదర్బార్ నిర్వహించారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించి, స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా స్పందించాలని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. నెలబల్లి భీమవరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతోనూ ఎమ్మెల్యే సమావేశమయ్యారు. పార్టీ బలోపేతం, గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి అవసరాలను గుర్తించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

**అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**



ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, అంగన్‌వాడీ భవనాలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. "మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడమే మా లక్ష్యం. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తాం. ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నిరంతరం పనిచేస్తాం" అని ఆమె పేర్కొన్నారు.

**పూలవర్షంతో ఘనస్వాగతం**



పెళ్లకూరు మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే విజయశ్రీకి స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. పూలవర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థా పనలతో పాటు ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం ఈ పర్యటనలో ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కార్యక్రమాల్లో స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు,సంచి కృష్ణయ్య యాదవ్, పేరం రమేష్ నాయుడు, నేలవల్లి సిద్ధులు నాయుడు, చైతన్య కృష్ణారెడ్డి, కందమూడు శివకుమార్ దువ్వూరు రాకేష్ రెడ్డి, లోకేష్ నాయుడు, రాజారెడ్డి, వేణు రెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలపై కూటమి నేతల విస్తృత స్థాయి సమావేశం

- నంద్యాల మున్సిపాలిటీపై ప్రత్యేక దృష్టి
- స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యాచరణ
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన ఎన్నికల పరిశీలకులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి



**నంద్యాల - సూర్య వాస్తవం :**

నంద్యాల స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు నంద్యాల జిల్లా ఎన్నికల పరిశీలకులు శ్రీ వైకుంఠం ప్రభాకర్ చౌదరి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి శ్రీ ఫరూక్‌తో పాటు తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నంద్యాల మున్సిపాలిటీని కైవసం చేసుకునే లక్ష్యంతో స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల వ్యూహాలపై చర్చించారు.

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు, ఎన్నికల్లో సమన్వయంతో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన సమయంలో గుర్తింపు లభిస్తుందని వైకుంఠం ప్రభాకర్ చౌదరి భరోసా ఇచ్చారు. కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతూ, రానున్న ఎన్నికలను సమష్టి కృషితో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

# 'కామ్రేడ్ కల్యాణ్' మూవీ రివ్యూ




వినోదాత్మక కథాంశాలను ఎంచుకుంటూ సినిమాలు చేస్తున్నారు కథానాయకుడు శ్రీ విష్ణు. ఆయన సినిమా అంటే ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ అనే నమ్మకం ప్రేక్షకుల్లో ఉంటుంది. ఈ జాబితాలోనే శ్రీ విష్ణు మరో వినోదాత్మక కథాంశంతో నటించిన చిత్రం 'కామ్రేడ్ కల్యాణ్'. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా ఎలా ఉంది? ఈ చిత్రం ప్రేక్షకులకు వినోదాన్ని పంచిందా? లేదా అనేది సమీక్షలో తెలుసుకుందాం. 1992వ సంవత్సరంలో జరిగే కథ ఇది. మాడుగుల అనే ప్రాంతానికి చెందిన కల్యాణ్ (శ్రీ విష్ణు) ఆర్.నారాయణ మూర్తికి వీరాభిమాని. అరకొర చదువు మాత్రమే చదువుకున్న కల్యాణ్ థియేటర్‌ను లీజుకు తీసుకుని ఆర్.నారాయణ మూర్తి సినిమాలు ప్రదర్శిస్తూ కాలం గడుపుతుంటాడు. ఓసారి అనుకోకుండా ప్రాణ పాయ స్థితిలో ఉన్న తన తల్లి (రాధికా శరత్‌కుమార్)ని కేరళ నుంచి వచ్చిన సితార దేవి (మహిమా నంబియార్) కాపాడుతుంది. అప్పటి నుంచే కల్యాణ్ ఆమె ప్రేమలో పడిపోతాడు. ఆమెతో జీవితాన్ని పంచుకోవాలనుకుంటాడు. తన మనసులోని ప్రేమను సితారదేవికి తెలియజేయాలని అనుకుంటున్న తరుణంలోనే ఓ నిజం తెలుస్తుంది. ఆ విషయం తెలుసుకున్న కల్యాణ్ ఎలాగైనా సితారను, ఆమె కుటుంబాన్ని కష్టాల నుంచి బయటపడేయాలని నిర్ణయిం చుకుంటాడు. అందుకోసం ఎవరూ చేయని, సాహసించని దారిని ఎంచుకుంటాడు. అప్పుడు ఏం జరిగింది? కల్యాణ్ కామ్రేడ్ కల్యాణ్‌గా ఎందుకు మారాల్సి వచ్చింది? ఆ తరువాత జరిగిన పరిణామాలేమిటి? సితార కుటుంబాన్ని కష్టాల నుంచి ఎలా గట్టెక్కించాడు? పోలీస్ ఆఫీసర్ (షైన్ టామ్ చాకో) కు ఈ కథకు సంబంధం ఏమిటి ? అనేది మిగతా కథ ఈ సినిమా ప్రచార చిత్రాల్లో ఉన్నట్లుగా నక్సలైట్స్ దళాలు, పోలీసులు.. ఇలా కనిపించగానే అందరూ ఇదొక సీరియస్ కథ అనుకుంటారు. అయితే ప్రారంభ నేపథ్యం అలాంటి ఆలోచన కలిగించినప్పటికీ ఇది పూర్తి స్థాయి ఎంటర్‌టైన్‌మెంట్ సినిమా. ఇప్పటి వరకు నక్సల్ నేపథ్యంలో వచ్చిన సీరియస్ సినిమాలకు పూర్తి భిన్నంగా అల్లుకున్న కథ ఇది. ప్రతి సన్నివేశంలో కామెడీ పండించడానికి మాత్రమే ట్రై చేశారు. ఎలాంటి లాజిక్‌లు లేకుండా ఆడియన్స్‌ను నవ్వించడమే ధ్యేయంగా తెరకెక్కించిన సినిమా ఇది. బాలకృష్ణ అభిమానిగా రాధికా శరత్‌కుమార్ చేసే హడావుడి, శ్రీ విష్ణు తన ప్రేమను హీరోయిన్‌కు తెలియజేయడానికి పడే పాట్లతో.. అక్కడక్కడా పండిన కామెడీ సన్నివేశాలతో ఫస్టాఫ్ అంతంత మాత్రంగా ఫర్వాలేదనిపించే స్థాయిలో ఉంటుంది. ఇక సెకండాఫ్‌లో కథను నడిపించడంలోనే అసలు సమస్య ప్రారంభమవుతుంది. అందుకే దర్శకుడు సెకండాఫ్‌ను కూడా పూర్థిస్థాయి కామెడీతో గట్టెక్కించాలనుకున్నాడు. అయితే ఈ ప్రయత్నం ఫలించలేదు. దుబాయ్ బాబుగా సత్య పాత్ర కాసేపు నవ్విస్తుంది. సత్య రాసే ప్రేమలేఖ ఎపిసోడ్ ఓ మోస్తరుగా అలరిస్తుంది. బిశ్వాస్ పాత్రలో ఉపేంద్ర లిమాయే చేసిన కామెడీ వర్కవుట్ కాలేదు. ఈ ట్రాక్ కూడా పండి ఉంటే సినిమా రిజల్ట్‌కు ప్లస్ అయ్యేది. వెన్నెల కిషోర్ కూడా తన పాత్రతో నవ్వులు పూయించే ప్రయత్నం చేసినా అది అంతగా ఆకట్టుకోలేకపోయింది. సెకండాఫ్‌లో వచ్చే కన్‌ఫ్యూజన్ కామెడీ ఇంతకు ముందే చాలా సినిమాల్లో చూసినట్లుగా అనిపించడంతో విసుగు తెప్పిస్తుంది. ఉపేంద్ర లిమాయే పాత్ర ప్రారంభంలో నవ్వించినా రాను రాను ఆ కామెడీ బోరింగ్‌గా మారిపోయింది. కామెడీ సినిమా కాబట్టి ఈ కథాంశంలో ఎలాంటి లాజిక్కులు ఉండవు. 90ల నేపథ్యంలో కొనసాగే కథ అయినా సినిమాటిక్ లిబర్టీతో చాలా సన్నివేశాల్లో ప్రస్తుత సినిమా ప్రస్తావన కూడా తీసుకొచ్చారు. సినిమా ఆద్యంతం గ్రాఫ్‌గా చెప్పుకుంటూ పడుతూ లేస్తూ ఉన్న ఈ కథకు పతాక సన్నివేశాలు కూడా అంతా ఇంపాక్ట్‌గా లేకపోవడం కూడా మైనస్‌గా మారింది. ఓవరాల్‌గా నవ్వించాలనే ధ్యేయంతో రొటీన్ కామెడీతో రూపొందిన కామ్రేడ్ కల్యాణ్‌లో అక్కడక్కడా నవ్వులు పూసిన రైటింగ్‌లో ఏ మాత్రం కొత్తదనం మాత్రం కనిపించదు. శ్రీవిష్ణుకు ఇలాంటి పాత్రలు చేయడంలో అలవాటుపడటంతో కల్యాణ్ పాత్రలో ఒదిగిపోయాడు. కమెడియన్స్ సుదర్శన్, సత్యతో కలిసి నవ్వించడానికి తన వంతు ప్రయత్నం చేశాడు. మహిమా నంబియార్ పాత్రకు నటనకు పెద్దగా స్కోప్ లేదు. రాధికా శరత్‌కుమార్, సత్య రఘుబాబు, ఉపేంద్ర లిమాయో, వెన్నెల కిశోర్, మురళీధర్ గౌడ్, శ్రీకాంత్ అయ్యంగార్ ఇలా అందరూ తమ పాత్రలకు న్యాయం చేశారు. అడవిలో చిత్రీకరణ, అక్కడి విజువల్స్, కథకు తగ్గ లోకేషన్స్‌ల్లో చిత్రీకరణతో సాయి శ్రీరామ్ కెమెరా వర్క్ ఆకట్టుకుంటుంది. రొటిన్ కథతో... ఏ మాత్రం కొత్తదనం లేకుండా అక్కడక్కడ నవ్వించే కామెడీ సన్నివేశాలతో.. ఎలాంటి లాజిక్‌లు లేకుండా, ప్రేక్షకులకు నవ్వులు పంచాలని చేసిన 'కామ్రేడ్ కల్యాణ్' ప్రయత్నం పూర్థిస్థాయిలో సఫలీకృతం కాలేదు. కామెడీ ఎలా ఉన్నా ఫర్వాలేదు.. మాకు టైమ్ పాస్ అవుతుంది అని భావించే ప్రేక్షకులకు 'కామ్రేడ్ కల్యాణ్' ఓ మోస్తరుగా నచ్చే అవకాశం ఉంది.



## ఆ విమర్శలు పట్టించుకుంటే భయంతో ఆగిపోయేదాన్ని: కత్రినా

బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ సోషల్ మీడియా ట్రోలింగ్, బాడీ షేమింగ్‌పై ఘాటుగా స్పందించారు. ఆన్‌లైన్‌లో వచ్చే ప్రతికూల వ్యాఖ్యలకు భయపడితే జీవితంలో ముందుకు సాగలేమని ఆమె అన్నారు. లండన్‌లో తన సౌందర్య ఉత్పత్తుల బ్రాండ్ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.తన కుమారుడి జననం తర్వాత ఇటీవల కత్రినా తొలిసారిగా బయట కనిపించినప్పుడు, సోషల్ మీడియాలో ఆమె శరీరాకృతిపై కొందరు నెగటివ్ కామెంట్లు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆమె స్పందించారు. "సోషల్ మీడియాలో వచ్చే మాటలు మన ఆత్మవిశ్వాసంపై ప్రభావం చూపకుండా చూసుకోవాలి. ప్రతి ఒక్కరి కామెంట్లను పట్టించుకుంటూ పోతే, మనకోసం మనం నిర్ణయాలు తీసుకోలేం. ప్రతి విమర్శకు నేను స్పందించి ఉంటే, భయంతో అక్కడే స్తంభించిపోయేదాన్ని" అని కత్రినా వివరించారు.కొన్నిసార్లు ప్రపంచం మనల్ని ప్రశంసిస్తుందని, మరికొన్నిసార్లు మనకు మనమే ధైర్యం చెప్పుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆమె పేర్కొన్నారు. గతేడాది నవంబర్‌లో కత్రినా ఓ బాబుకు జన్మనిచ్చారు. ఆ తర్వాత ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు ఆమెపై బాడీ షేమింగ్ కామెంట్లు వచ్చాయి. ఈ ఘటన జరిగిన కొన్ని వారాల తర్వాత ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.



### షాయ్ హోప్ సంచలన శతకం..

# భారత్ కు ఊహించని ఓటమి




రాంచీ వేదికగా జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు చారిత్రక విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 250 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 18.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ షాయ్ హోప్ (102 నాటౌట్; 45 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్సులు) ఆకాశమే హద్దుగా చెలరేగి అద్భుత సెంచరీతో జట్టును గెలిపించాడు. టీ20 చరిత్రలో వెస్టిండీస్‌కు ఇదే అత్యధిక పరుగుల ఛేదన కావడం విశేషం. అంతేకాదు, అంతర్జాతీయ క్రికెట్లో ఇది రెండో అత్యధిక ఛేదన.భారీ లక్ష్య ఛేదనలో విండీస్‌కు ఆరంభంలోనే గట్టి షాక్ తగిలింది. యువ బౌలర్ మయాంక్ యాదవ్ ఒకే ఓవర్లో రెండు వికెట్లు పడగొట్టి భారత్‌కు ఆశలు రేపాడు. అయితే, ఆ తర్వాత షెర్ఫాన్ రదర్‌ఫోర్డ్ (84; 37 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్సులు) కెప్టెన్ హోప్‌తో కలిసి విధ్వంసం సృష్టించాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశారు. సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించిన హోప్, అదే బంతితో తన సెంచరీని పూర్తి చేసుకోవడం గమనార్హం.అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. సంజూ శాంసన్ (82; 41 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సులు) అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అతనికి తోడుగా ఇషాన్ కిషన్ (43), శ్రేయస్ అయ్యర్ (40), తిలక్ వర్మ (44లి) కూడా రాణించడంతో భారత్ భారీ స్కోరు సాధించింది. అయితే, బౌలర్ల వైఫల్యంతో ఈ స్కోరును కాపాడుకోలేకపోయింది. మయాంక్ యాదవ్ 3 వికెట్లు తీసినా మిగతా బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు. ఈ విజయంతో ఐదు టీ20ల సిరీస్ ను విండీస్ 1-1తో సమం చేసింది. ఇరుజట్ల మధ్య మూడో టీ20 ఈ నెల 11న ఇండోర్ లోని హోల్కర్ స్టేడియంలో జరగనుంది.

# నేను ఏ మతాన్ని కించపరచలేదు: ఇర్ఫాన్ పఠాన్



భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్, తన పేరుతో సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న నకిలీ వార్తలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. తాను ఏ మతాన్ని కించపరిచేలా ఎప్పుడూ మాట్లాడలేదని స్పష్టం చేశాడు. కొంతమంది కేవలం వ్యూస్ కోసం, ఎలాంటి ఆధారం లేకుండా తన పేరును వాడుకుంటూ తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో పేర్కొన్నాడు. "నా పేరుతో ఆధారం లేకుండా, కేవలం వ్యూస్ కోసం ఫేక్ న్యూస్ సర్క్యులేట్ అవుతోంది. దయచేసి ఎవరూ నమ్మవద్దు, షేర్ చేయవద్దు" అని ఇర్ఫాన్ తన పోస్టులో కోరాడు. తన నుంచి అధికారికంగా సమాచారం వస్తే తప్ప, ఇతర వార్తలను విశ్వసించవద్దని అభిమానులకు విజ్ఞప్తి చేశాడు."నేను నా మతంతో సహా ఏ మతాన్ని కూడా ఎప్పుడూ కించపరచలేదు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మే ముందు లేదా ఇతరులకు పంపే ముందు వాస్తవాలను సరిచూసుకోవాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నాను" అని ఇర్ఫాన్ వివరించాడు. ఈ మేరకు అతడు చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది.



## హాకీ టోర్నీ నుంచి పాకిస్థాన్ ఔట్.. బరిలోకి బంగ్లాదేశ్

భారత్ ఆతిథ్యమివ్వనున్న 2026 ఆసియన్ హాకీ ఛాంపియన్స్ ట్రోఫీలో అనూహ్య మార్పు చోటుచేసుకుంది. ఇరు దేశాల మధ్య నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతలు, భద్రతా కారణాలను చూపుతూ ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ నుంచి పాకిస్థాన్ హాకీ జట్టు వైదొలగింది. దీంతో, రిజర్వ్ జట్టుగా ఉన్న బంగ్లాదేశ్‌కు ఆసియన్ హాకీ ఫెడరేషన్ (ఏహెచ్‌ఎఫ్) టోర్నీలో పాల్గొనేందుకు అవకాశం కల్పించింది.ఈ టోర్నమెంట్‌ను అక్టోబర్ 27 నుంచి నవంబర్ 5 వరకు పంజాబ్‌లోని జలంధర్, మొహాలీ నగరాల్లో నిర్వహించనున్నారు. అయితే, తమ ఆటగాళ్ల భద్రతపై ఆందోళన వ్యక్తం చేసిన పాకిస్థాన్ హాకీ ఫెడరేషన్ (పీహెచ్‌ఎఫ్), తమ మ్యాచ్‌లను ఏదైనా తటస్థ వేదికకు మార్చాలని ఏహెచ్‌ఎఫ్‌ను కోరింది. ఈ అభ్యర్థనను హాకీ ఇండియా నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. షెడ్యూల్ ప్రకారమే టోర్నీ జరుగుతుందని స్పష్టం చేయడంతో పాక్ ఈ పోటీల నుంచి తప్పుకుంటున్నట్లు అధికారికంగా ప్రకటించింది."మా ఆటగాళ్లు, అధికారుల భద్రత, గౌరవానికే ప్రథమ ప్రాధాన్యం ఇస్తాం" అని పీహెచ్‌ఎఫ్ అధ్యక్షుడు మొహ్యుద్దీన్ అహ్మద్ వానీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ వైదొలగడంతో ఏహెచ్‌ఎఫ్ ఆహ్వానం మేరకు బంగ్లాదేశ ఈ టోర్నీలో పాల్గొనేందుకు అంగీకరించింది. దీంతో ఆతిథ్య భారత్‌తో పాటు జపాన్, చైనా, మలేషియా, దక్షిణ కొరియా, బంగ్లాదేశ్ జట్లు టైటిల్ కోసం పోటీ పడనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్ ఇప్పటివరకు నాలుగుసార్లు ఈ టైటిల్‌ను గెలుచుకుంది. 2018లో భారత్, పాకిస్థాన్ జాయింట్ విన్నర్స్‌గా నిలవడం గమనార్హం. ఇటీవలి కాలంలో భారత్‌లో జరిగే ఆసియా కప్, జూనియర్ వరల్డ్ కప్ వంటి టోర్నీలకు కూడా పాక్ జట్టు దూరంగా ఉంది. త్వరలోనే సవరించిన టోర్నమెంట్ డ్రాను ప్రకటించే అవకాశం ఉంది.

# ఘనంగా శ్రీ శివాలయంలో మాసశివరాత్రి ప్రదోషకాల పూజలు

**- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు..**
**శివనామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం**



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** మండల కేంద్రంలోని శ్రీ ఈశ్వరి దేవి మఠం ప్రాంగణంలో ఉన్న శ్రీ శివాలయంలో శుక్రవారం మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించు కుని ప్రదోషకాల పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీ ఈశ్వరి దేవి మఠాధిపతి శ్రీ వీర శివకుమార స్వాములవారి ఆధ్వర్యంలో శ్రీ పరమేశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులు ఆధ్యాత్మిక భక్తిలో మునిగిపోయారు. శ్రీ పరమేశ్వర స్వామివారి దర్శనం కోసం ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ప్రదోషకాల పూజలు, ప్రత్యేక పంచహారతులు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తమ కుటుంబాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ప్రతి నెల బహుళ చతుర్దశి రోజున శ్రీ శివాలయంలో నిర్వహించే మాసశివరాత్రి ప్రదోషకాల పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని జిల్లా సహాయ కమిషనర్, శ్రీ ఈశ్వరి దేవి మఠం కార్యనిర్వహణ అధికారి శంకర్ బాలాజీ కోరారు. పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. భక్తులు భక్తిపారవశ్యంలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# నెల దాటినా వినతిపత్రంపై స్పందనేదీ?

**- రేకలకుంట కొండల్లో గాలిమరల నిర్మాణాలపై సీపీఐ నేత ప్రభాకర్ ప్రశ్న**
**- అనుమతులు లేకుంటే పనులు నిలిపివేయాలి..**
**సంబంధిత కంపెనీపై చర్యలు తీసుకోవాలి**




**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** రేకలకుంట కొండల్లో గాలిమరల నిర్మాణాలకు సంబంధించి అనుమతులపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించి నెల రోజులు దాటినా స్పందన లేకపోవడంపై సీపీఐ మండల కార్యదర్శి పెద్దుల్లపల్లి ప్రభాకర్ ప్రశ్నించారు. వినతిపత్రంపై అధికారులు స్పందించకపోవ డానికి కారణమేంటని ఆయన నిలదీశారు. రేకలకుంట కొండల్లో గాలిమరల ఏర్పాటుకు సంబంధిత కంపెనీకి రెవెన్యూ, అటవీ, పర్యావరణ శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఉన్నాయా? లేవా? అనే విషయాన్ని అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతు న్నట్లు తేలితే వెంటనే పనులు నిలిపివేసి, సంబంధిత కంపెనీపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు సమర్పించే ఫిర్యాదులు, వినతిపత్రాలపై అధికారులు సకాలంలో స్పందించి, వాస్తవ పరిస్థితిని వెల్లడించాల్సిన బాధ్యత ఉందన్నారు. నెల రోజులు గడిచినా ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం వల్ల అధికారుల తీరుపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. రేకలకుంట కొండల్లో గాలిమరల ఏర్పాటుకు సంబంధించిన భూముల వివరాలు, నిర్మాణ అనుమతులు, వివిధ శాఖల నుంచి పొందిన అనుమతులను సమగ్రంగా పరిశీలించాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నట్లు గుర్తిస్తే తక్షణమే అడ్డుకుని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# దీపావళి టపాసుల విక్రయ లైసెన్సుల కోసం ఈ నెల 17లోగా దరఖాస్తు చేసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** దీపావళి పండుగ సందర్భంగా 2026 సంవత్సరానికి టపాసుల విక్రయాల కోసం కొత్త తాత్కాలిక లైసెన్సులు పొందాలనుకునే వారు, ఇప్పటికే లైసెన్సులు కలిగి ఉండి రెన్యువల్ చేసుకోవాలనుకునే వారు ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త తాత్కాలిక లైసెన్సుల కోసం ఫారం ాజు-5, రెన్యువల్ కోసం ఫారం =జు-1లో దరఖాస్తులను సంబంధిత సబ్ కలెక్టర్ లేదా రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.లైసెన్సుదారులు సబ్ కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు సూచించిన ప్రదేశాల్లోనే టపాసులను విక్రయించాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇతర ప్రాంతాల్లో విక్రయాలు జరిపితే లైసెన్సులు రద్దు చేయడంతో పాటు సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

# స్పెషల్ టెట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**- పరీక్షా కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి**
**- జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ**





**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లాలో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించ నున్న ఏపీ స్పెషల్ టెట్--2026 (ఇన్ సర్వీస్ టీచర్స్) పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిం చేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత శాఖల అధికా రులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో పరీక్షల నిర్వహణపై జాయింట్ కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని మూడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1,616 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందులో మదనపల్లెలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో 240 మంది, రాయచోటిలోని భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో 420 మంది, శ్రీ సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో 956 మంది అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు నిరంతరం విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, ఏపీఎస్ఆర్టీసీ అధికారులు అభ్యర్థుల కోసం ఆర్టీసీ వారు సరిపడే బస్సులు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని, పోలీస్ వారు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించాలని, కేంద్రాలలో మెడికల్ అండ్ హెల్త్ వారు ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు తదితర మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు.

ఈ పరీక్షలకు డిపార్ట్మెంటల్ ఆఫీసర్లుగా మదనపల్లి లోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సెంటర్ కు మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ కె. ప్రభాకర్ రెడ్డి,భాస్కర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల రాయచోటి కు సి.రామకృష్ణుడు, శ్రీ సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలకు యం. బాలాజీ నాయక్ నియమించడం జరిగిందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రాలకు నియమించిన డిపార్ట్‌మెంటల్ అధికారులు ఉదయం 8 గంటలకే విధులకు హాజరు కావాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. అభ్యర్థుల హాల్‌టికెట్లు, గుర్తింపు కార్డులు, ఇతర ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించిన తర్వాతే పరీక్షలకు అనుమతించాలన్నారు. నామినల్ రోల్స్‌లో పేర్లు, తండ్రి పేర్లు, పుట్టిన తేదీలకు సంబంధించిన చిన్నపాటి అక్షర దోషాలను సరైన ఆధారాల ఆధారంగా మాత్రమే సరిచేయాలని, సవరించిన వివరాలను అదే రోజు జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయానికి సమర్పించాలని స్పష్టం చేశారు. దివ్యాంగ అభ్యర్థులకు నిబంధనల ప్రకారం స్క్రైబులను, అదనపు సమయాన్ని కల్పించాలని, జిల్లా విద్యాశాఖా ధికారి అనుమతితోనే సహాయకులను కేటాయించాలని తెలిపారు. హాల్‌టికెట్‌పై ఫోటో లేని అభ్యర్థులు ఇటీవలి ఫోటోతో పాటు చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డును తీసుకువస్తేనే నిబంధనల ప్రకారం అనుమతించాల న్నారు. పరీక్షా కేంద్రాల వద్ద కేంద్రం పేరు, కోడ్, పరీక్షల షెడ్యూల్ తెలిపే సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, అభ్యర్థులకు ముందస్తుగా స్పష్టమైన సమాచారం అందించాలని ఆదేశించారు. ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వ హణలో ఎలాంటి పొర పాట్లకు తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, పరీక్షలు పూర్తయ్యాక అవసరమైన నివేదికలు, సవరించిన నామినల్ రోల్స్‌ను నిర్ణీత గడువులోగా సమర్పించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. పరీక్షలకు సంబం ధించిన అధికారులు ఒక వాట్సాప్ గ్రూప్‌ను తయారు చేసి ఎప్పటికప్పుడు సమా చారాన్ని పై అధికారులకు తెలియజేయాలని, ఆయా అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని రకాల ఏర్పా ట్లు చేపట్టాలని స్పెషల్ టెట్ పరీక్షలను విజయ వంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా డిఇఓ సుబ్రహ్మణ్యం, కలెక్టరేట్ ఏవో శ్రావణి, మెడికల్, పోలీస్, ఏపీ ఎస్పీడీసీఎల్, సంబంధిత ఎమ్మార్వోలు, ఎంఈఓ లు,ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాలభటులు ప్రపంచస్థాయి పౌరులుగా ఎదగాలి

**- స్కౌట్ శిక్షణతో క్రమశిక్షణ, సేవాభావం పెంపొందుతాయి**
**- నూతన స్కౌట్, గైడ్ యూనిట్ల ప్రారంభోత్సవంలో జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి**







**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** విద్యార్థులు స్కౌటింగ్‌లో పాల్గొని నాయకత్వ లక్షణాలను పెంపొం దించుకోవడంతోపాటు ప్రపంచస్థాయి పౌరులుగా ఎదగాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి ఆకాంక్షించారు. శు క్రవారం ఉదయం సంబేపల్లి మండలం మోటకట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన స్కౌట్, గైడ్ యూనిట్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ స్కౌటింగ్ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి పెం పొందుతాయని తెలిపారు. నైతిక విలువలను అలవర్చు కోవడంతోపాటు శారీరక, మానసిక వికాసానికి స్కౌటింగ్ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.

స్కౌటింగ్‌లో శిక్షణ పొంది ధ్రువపత్రాలు పొందిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 27 ప్రకారం ట్రిపుల్ ఐటీ, పాలిటెక్నిక్, వైద్య విద్య వంటి కోర్సుల్లో ప్రవేశాలు, ఉద్యోగ అవకాశాలకు సంబంధించి రిజర్వేషన్ సౌకర్యాలు ఉన్నాయని వివరించారు. ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్ లను ఏర్పాటు చేయుటకు ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. ప్రతి విద్యార్థి స్కౌటింగ్‌లో భాగస్వామి అయి సమాజ సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలకు చెందిన 17 మంది స్కౌట్ విద్యార్థులకు, 15 మంది గైడ్ విద్యార్థినులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, అడ్వాన్స్‌డ్ గైడ్ కెప్టెన్ చప్పిడి పద్మజ, స్కౌట్ యువ ఆపద మిత్ర నోడల్ అధికారి మురళి నాయక్, స్కౌట్ మాస్టర్లు నం ి సింహులు, వేణుమాధవ్ రాజు, గైడ్ కెప్టెన్ పద్మావతి, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్నమయ్య డిఇఓను సస్పెండ్ చేయాలి

**- డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అక్రమాలపై విచారణ చేయాలి**
**- చిన్నపిల్లల భోజన పథకంలో అక్రమాలు సిగ్గు చేటు**




**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లాలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో జరిగిన అవినీతిలో డిఇఓను సస్పెండ్ చేసి, విచారణ జరపాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.యం. ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్జెడి కార్యాల యంలో ఆర్జెడి శామ్యూలుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం.ఓబులేసు యాదవ్ అన్నమయ్య జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో లక్ష కోడి గుడ్లు, లక్ష చిక్కిలలో తేడాతో 2025 -26 విద్యా సంవత్సరం తోపాటు, ఈ విద్యా సంవత్సరం కూడా పాఠశాల హెడ్ మాస్టర్, డిఇఓ ఆన్లైన్ ద్వారా ప్రభుత్వంకు పంపే దానిలో భారీ వ్యాత్యాసాలు వున్నాయన్నారు . సెప్టెంబర్ 19వ తేదీన భారీ కుంభకోణం జరిగి నేటికీ 20 రోజుల అవుతున్న డీఈవో పై చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ అధికారులు పూర్తి అలసత్వం వహిస్తు న్నారని మండిపడ్డారు దీనిలో డిఇఓ పాత్ర ఉండనేది వస్తాము అన్నారు . ప్రతి నెల కూడా అన్నమయ్య జిల్లాలో ప్రతి పాఠశాలలో ఇదే విధమైన తేడాలు వస్తున్నాయి, దీని ద్వారా కోట్ల రూపాయలు చేతులు మారాయి. కాంట్రాక్టురు పైన కూడా విచారణ జరపాలని,దీనికి భాద్యునిగా వున్న డిఇఓ ను సస్పెండ్ చేసి, విచారణ జరిపి మిగతా భాద్యులపైన చర్యలు తీసుకోవాలని మనవి. ఇంకా రాయలసీమ వ్యాప్తంగా వున్న 8 జిల్లాలలో కూడా విచారణ జరపాలని ఆర్ఎస్ఎఫ్ డిమాండ్ చేశారు. స్పందించిన ఆర్జెడి పూర్తిస్థాయిలో విచారణ చేపడతామని బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఆక్రమణ భూములపై ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన గంగన్న పల్లె ప్రజలు



**రాయచోటి-సూర్య వాస్తవం:** రాయచోటి నియోజకవర్గం లక్కిరెడ్డిపల్లి మండల పరిధిలోని గంగనపల్లెలో పది ఎకరాల పరంబోకు భూమి ఆక్రమించి ఆన్లైన్ చేయించుకున్నారని గంగనపల్లి వాస్తవ్యులు రాయచోటి ఆర్డిఓకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో వారిచ్చిన ఫిర్యాదు మేరకు ఆన్లైన్ చెక్ చేసి చూడగా 2013 సంవత్సరంలో గంగనపల్లి ఊరు ఆనుకొని 440 /1,2,3 సర్వే నెంబర్లు అబ్దుల్ సత్తార్ , ఆవుల వీరయ్య అనే వ్యక్తులు 10 ఎకరాల భూమి ఆక్రమించారని వారు ఆ ఫిర్యాదుల పేర్కొన్నారు. ఈ భూమి ఊరు ఆనుకుని ఉండగా గంగనపల్లి వారు దిబ్బలు , మనుషులు చనిపోతే గోరీలు వేసుకోవడానికి అలాగే పొలాల్లో పంట పెడితే అనుకూలమైన భూమి కాబట్టి వారు ఆక్రమించిన భూమిని రద్దు చేయాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో గంగన పల్లి గ్రామస్తులు రాయచోటి పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : 41/1320, Sankarapuram, Kadapa, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, CELL : : 9885404140



## పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులపై తనిఖీ..

**- కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీవో, ఎస్ఐ శివ తహసీలార్ అనిల్ సంయుక్త పరిశీలన**



**బెళుగుప-  సూర్య వాస్తవం:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎస్ఐ శివ తహసీలార్ అనిల్ శుక్రవారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సంయుక్తంగా సందర్శించి, అక్కడి సౌకర్యాలను పరిశీలించారు.పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, ఎన్నికల సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయా లేదా అనే అంశాలను తనిఖీ చేశారు. ఎన్నికల నిర్వహణకు అనుగుణంగా కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి, పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టడమే లక్ష్యంగా అధికారులు ఈ తనిఖీలు నిర్వహించారు.

## అర్హులైన ప్రతి ఓటరుకు జాబితాలో చోటు కల్పించాలి

**- కొత్త ఓటర్లు, జాబితాలో పేర్లు గల్లంతైన వారికి నమోదు అవకాశం**
**- అక్టోబర్ 16న తుది ఓటర్ల జాబితా ప్రచురణ**



**అనంతపురం కలెక్టరేట్  -  సూర్య వాస్తవం :** అనంతపురం అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటర్ల జాబితాలో చోటు కోల్పోకూడదనే లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రత్యేక డ్రైవ్ చేపట్టనుంది. ఇందులో భాగంగా నోటీ సుల దశలో ఏఎస్డీడీ ఓటర్ల వివరాలను పునఃపరిశీలించడంతో పాటు అనర్హులైన ఓటర్ల పేర్లను గుర్తించి తొలగిం చేందుకు చర్యలు చేపట్టనున్నారు. అదే సమయంలో కొత్త ఓటర్లు, అర్హత ఉన్నప్పటికీ ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు కాని వ్యక్తులకు నమోదు చేసుకునే అవకాశం కల్పించనున్నారు.ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటర్ల జాబితాలో చేర్చడం, అనర్హులైన పేర్లను తొలగించడం ఈ ప్రత్యేక డ్రైవ్ ప్రధాన ఉద్దేశమని ఎన్నికల సంఘం పేర్కొంది.2026 అక్టోబర్ 16న ప్రచురించనున్న తుది ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హులైన వ్యక్తులు, తదుపరి అర్హత తేదీల నాటికి అర్హత పొందిన వారు నిరంతర నవీకరణ ప్రక్రియలో భాగంగా ఫారం-6 సమర్పించి ఓటరుగా నమోదు చేసుకోవచ్చని వెల్లడించింది.

## దసరా సెలవుల్లో పిల్లల భద్రతపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి..

**- తల్లిదండ్రులకు ఎస్ఐ శివ, తహసీల్దార్ అనిల్ కుమార్ విజ్ఞప్తి..**

**బెళుగుప్ప - సూర్య వాస్తవం :** దసరా పండుగ సెలవుల నేపథ్యంలో మండలంలోని తల్లిదండ్రులు తమ చిన్నారుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్ఐ శివ, తహసీల్దార్ అనిల్ కుమార్ విజ్ఞప్తి చేశారు. పండుగ సెలవుల్లో పిల్లలు ఆటపాటలతో బయట గడిపే సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లోని చెరువులు, బావులు, కాలువలు, ఇతర నీటి వనరుల వద్దకు పిల్లలు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. చిన్నారులకు నీటి లోతుపై సరైన అవగాహన లేకపోవడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల పిల్లలను ఒంటరిగా బయటకు పంపకుండా, వారు ఎక్కడ ఆడు కుంటున్నారో తల్లిదండ్రులు ఎప్పటి కప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు.పండుగ సెలవులను పిల్లలు సంతో షంగా, సురక్షితంగా గడిపేలా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని ఎస్ఐ శివ, తహసీల్దార్ అనిల్ కుమార్ కోరారు. ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలని మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# స్థానిక ఎన్నికలపై వైసిపీ కుట్రలకు సుప్రీం బ్రేక్

**-కాలవ శ్రీనివాస్**



**రాయదుర్గం - సూర్య వాస్తవం :** రాష్ట్రంలో స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు జరగకుండా చూడాలని వైసిపీ నాయకత్వం పన్నిన కుట్రలు సుప్రీం కోర్టులో వీగిపోయాయని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. గుమ్మగట్ట మండలం మారేంపల్లిలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియ ముగిసిన తరువాతనే మున్సిపల్ వార్డుల పునర్విభజన జరగాలని వైసిపీ వేసిన పిటిషన్ను సుప్రీం కోర్టు శుక్రవారం తిరస్కరించడంతో స్థానిక ఎన్నికలకు అన్ని అడ్డంకాలు తొలగినట్లేనని ఆయన అభిప్రాయ పడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు ఇష్టపడని వైసీపీ ఏదో ఒక విధంగా ఎన్నికలు జరగకుండా అడ్డుకోవాలని ప్రయత్నించిందని విమర్శించారు. ఇక ఎన్నికల సంఘం తదుపరి ప్రక్రియను ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు. ఎన్నికల సంఘం రిజర్వేషన్ శాతాన్ని ఏ మేరకు అమలు చేసినప్పటికీ, తెలుగుదేశం పార్టీ మాత్రం 34 శాతానికి మించి బీసీలకు పోటీ చేసే అవకాశాన్ని కల్పిస్తుందని స్పష్టం చేశారు. బీసీలు మరింత ఉన్నత స్థితికి ఎదిగేలా రాజకీయ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. బీసీల ప్రగతి ప్రయాణం టీడీపీతోనే ప్రారంభమైందని, ఇప్పుడు మరింత వేగం పుంజుకుందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వివరించారు.

## మూగజీవాలకు జీవనాధారమైన గుట్టను

# మట్టి దోపిడీకి అనుమతులు ఎలా అనుమతులు ఇచ్చారు

**- తహశీల్దార్‌ను నిలదీసిన ఎగువపల్లి గ్రామస్తులు**



**గార్లదిన్నె -  సూర్య వాస్తవం:** మండల పరిధిలోని ఎగువపల్లి గ్రామ సమీపాన కనికరాళ్లగుట్ట నుంచి మట్టిని తోలుకోవడానికి అనుమతులు ఎలా ఇచ్చామని,మండల రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దార్ వీరమ్మను గ్రామ ప్రజలు నిలదీశారు. గ్రామం ఐక్యతకు మారుపేరైన ఎగువపల్లి గ్రామ ప్రజలు ఇంటికొకరు చొప్పున దాదాపు 80 మంది గ్రామస్తులు ఉక్కుమ్మడిగా శుక్రవారం తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూగజీవాలకు, రైతులకు జీవనాధారంగా వున్న అలాంటి గుట్టను కొందరు అక్రమార్కులు ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని, ఎగువపల్లి గ్రామస్తులు మండల తాసిల్దార్ ఈరమ్మతో ఆవేదన వ్యక్తం చేసారు.44వ జాతీయ రహదారి సిక్స్ వే కు 10 ఎకరాలు లీజుకు ఇచ్చారంటూ గత కొన్ని రోజులుగా రాత్రి, పగలు తేడా లేకుండా పెద్దపెద్ద యంత్రాలతో మట్టిని తోడి టిప్పర్లతో అక్రమంగా తరలిస్తున్నారని ఆ గ్రామ రైతులు ఆవేదనను వ్యక్తపరిచారు.గుట్ట తవ్వకాల వల్ల దాదాపు 5000 మూగజీవాలుకు, 5000 పశు వులకు పశుగ్రాసం కరువైతుందనన్నారు.రైతులు వర్షం వస్తే పశువులను జంతువులను ఆ గుట్ట కాపాడుతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్ అధికారులు స్పందించి కనికరాళ్లగుట్టలో అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు, గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. గుత్తేదారులు జాతీయ రహదారి సిక్స్ వే రుతో కల్లూరు గ్రామంలోని జాతీయ రహదారి ప్రక్కనగల దేవర వంకను దాదాపు 150 అడుగులు వెడల్పుతో కబ్జాదారులు ఆక్రమించుకున్న వంకను దాదాపు 6,7 అడుగుల ఎత్తుతో మాకొండల మట్టిని తరలిస్తూ అక్రమ కబ్జాదారులకు సహాయం చేస్తున్నారని దీనివల్ల బారీవర్షం వస్తే కల్లూరు గ్రామం, అగ్రహారం గ్రామాలలోని పాఠశాలలు దేవాలయాలు ఫ్యాక్టరీలు పంచాయతీ కార్యాలయాలతో పాటు దాదాపు 500 నివేస కుటుంబాలు జలమయ మవుతాయని ఆవేదన వ్యక్తపరిచారు. ఈ అక్రమ మట్టి రావాలా వల్ల జాతీయ రహదారి గుత్తేదారులు వంక అక్రమ కబ్జాదారులు భారీ ఎత్తున సొమ్ము చేసుకుం టున్నారని ఆగ్రహం వ్యక్తపరిచారు. ఇప్పటికే పంచాయతీ కార్యాలయం అధికారుల నిర్వాహములకు గ్రామానికి త్రాగునీరు ఎద్దడి తీవ్రస్థాయిలో ఏర్పడిందని, వాటికి తోడు రెవిన్యూ అధికారులు గుట్టలు ఇచ్చి పశువులకు మూగజీవాలకు పశుగ్రాసం లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా తహసిల్దార్ అనుమతులు ఇవ్వలేదని వివరణ ఇచ్చారు. మా గ్రామానికి న్యాయం చేకూర్చకపోతే కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు ధర్నాలు రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు.వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ హామీ ఇవ్వడంతో గ్రామ ప్రజలు వెను తిరిగారు. ఈ కార్యక్రమంలో ఏకే.నరసింహులు, నల్లపురెడ్డి, అశోక్ రెడ్డి,జగదీష్,ఆదిరెడ్డి,నాగరాజు, అశోక్, నారాయణరెడ్డి, వీరయ్య మాధవ, తిరుమలరెడ్డి, గోపాల్, కొలిమి భాష,ఆంజనేయులు, సాకే.వెంకటరెడ్డి ,పిల్లల శ్రీనివాసులు, రామసుబ్బయ్య ఎగుపల్లిసింహా, తిరుమలరెడ్డి, తదితర గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మహేంద్ర కల్యాణ మండపం నిర్వహణపై వివాదం

**- లెక్కలు చూపించి, బ్యాంకులో నగదు జమ చేస్తే చర్చలకు సిద్ధం**
**- రాజీ మార్గంలో సమస్య పరిష్కరించుకుందాం**

**గుంతకల్లు -  సూర్య వాస్తవం:** గుంతకల్లు తిలక్ నగర్‌లోని శ్రీ మహేంద్ర కల్యాణ మండపం నిర్వహణ, నూతన కమిటీ ఏర్పాటు, బుకింగ్‌ల ఆదాయంపై వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో విరాళదాతలు సమావేశమై తమ అభిప్రాయాలను వెల్లడించారు. బైలాస్ ప్రకారం విరాళదాతల ఆమోదంతోనే నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.గత కమిటీ పదవీకాలం ముగిసినప్పటికీ బుకింగ్‌ల ద్వారా వచ్చిన ఆదాయానికి సంబంధించిన లెక్కలు సమర్పించలేదని విరాళదాతలు ఆరోపించారు. సుమారు రూ.15 లక్షల వరకు నగదు ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ, పూర్తి లెక్కలు వెల్లడించి నగదును బ్యాంకు ఖాతాలో జమ చేయాలని



కోరారు. అయితే ఈ మొత్తంపై అధికారిక లెక్కల ద్వారా స్పష్టత రావాల్సి ఉంది. వ్యక్తిగత విభేదాల కారణంగా సంఘం ప్రతిష్ఠ దెబ్బతినకూడదని, పరస్పర చర్చలతో సమస్యను పరిష్కరించుకోవాలని విరాళదాతలు సూచించారు. చంద్రశేఖర్ చర్చలకు ముందుకొస్తే తాము కూడా రాజీకి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.నూతన కమిటీ ఆధ్వర్యంలో బుకింగ్‌లు ప్రారంభించినట్లు ప్రకటించారు. బుకింగ్‌ల కోసం నవీన్, విశ్వనాథ్, మంజునాథ్‌లను సంప్రదించాలని, ఇప్పటికే బుకింగ్‌లు చేసుకున్నవారు మండపం కార్యాలయంలో వివరాలు తెలుసుకోవాలని సూచించారు.